# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి సంపుటి: 10 సంచిక :53 ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ తేదీ: గురువారం 24-04-2025 పేజీలు:4 వెల: 2.00


## తీవ్రవాదానికి మతం అంటూ లేదు..

జమ్ముూకశ్మీర్‌లోని అనంత్‌నాగ్ జిల్లాలోని పహల్గాంలో జరిగిన భీకర ఉగ్రదాడిలో 28 మంది పర్యటకులు ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. మంగళవారం, ప్రకృతి అందాలను ఆస్వాదిస్తున్న పర్యటకులపై ఉగ్రవాదులు అకస్మాత్తుగా దాడి చేశారు. ఈ దాడిని సినీ ప్రముఖులు తీవ్రంగా ఖండిస్తున్నారు. తాజాగా ఈ ఘటనపై విరాటపర్వం దర్శకుడు వేణు వుడుగుల ఎక్స్ వేదికగా స్పందించాడు.పహల్గాములో విహారయాత్రకు వచ్చిన వారు తిరిగి రాలేదు. ఇది కేవలం రాజకీయ సమస్య కాదు, ఇది మానవతా సంక్షోభం. ప్రశాంతంగా జీవించాలనుకున్న వారి హృదయాలను తుపాకులు ధ్వంసం చేశాయి. తీవ్రవాదానికి మతం లేదు, భౌగోళిక సరిహద్దులు లేవు. ఎక్కడ మనిషి ప్రాణం గణాంకంగా మారిపోతుందో, అక్కడ మన మౌనం కూడా నిశ్శబ్దమైన నేరంగా మారుతుంది. జాతి గౌరవం తుపాకీ ద్వారా కాదు. దయతో, మానవత్వంతో, బాధితుల పట్ల కలిగిన స్పందనతో నిలబడుతుంది. ఇది కన్నీటిని మాటలుగా, మౌనాన్ని పోరాటంగా మార్చే కాలం. అంటూ వేణు వుడుగుల రాసుకొచ్చాడు.

## కాశ్మీర్‌లో హై టెన్షన్ వాతావరణం.. ముష్కరుల కోసం వేట



కాశ్మీర్: పహల్గామ్ ఉగ్ర దాడి తర్వాత కాశ్మీర్ అంతటా హై టెన్షన్ వాతావరణం నెలకొంది. ప్రజలంతా భయాందోళనతో వణికిపోతున్నారు. భారత ఆర్మీని చూసినా కూడా మహిళలు, చిన్నారులు గజగజలాడిపోతున్నారు.నిన్నటి ఘటనతో ఒక విధమైన భీతావాహ వాతావరణం ఏర్పడింది. ప్రస్తుతం కాశ్మీర్‌లో భద్రతా దళాలు మోహరించాయి. ఉగ్రమూకల కోసం జల్లెడ పడుతున్నాయి. మంగళవారం దాడి తర్వాత సమీపంలోనే ముష్కరులు నక్కి ఉంటారని భావిస్తున్నారు. దీంతో భద్రతా దళాలు వెతుకలాట ప్రారంభించాయి. మరోవైపు జమ్ములో బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. రోడ్లపైకి వచ్చి నిరసనలు నిర్వహించారు. ఉగ్రవాదులను మట్టుబెట్టాలని డిమాండ్ చేశారు.అంతేకాకుండా పాకిస్థాన్-భారత్ బోర్డర్‌లో కూడా హై టెన్షన్ వాతావరణం నెలకొంది. పాక్ వైమానిక దళాలుసరిహద్దు వైపు వస్తున్నాయని ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో భారత్ కూడా అప్రమత్తం అయింది. సోషల్ మీడియా వేదికగా ఈ వార్తలు టెండ్ అవుతున్నాయి. ఇదిలా ఉంటే పాక్‌పై భారత్ ప్రతీకార దాడి చేయాలంటూ నెటిజన్లు డిమాండ్ చేస్తున్నారు. అలాగే అక్టోబర్ 7, 2023లో హమాస్.. ఇజ్రాయెల్‌పై దాడి చేసినప్పుడు వెంటనే ఐడీఎఫ్ ప్రతీకార దాడి చేసింది. ఆ విధంగా భారత్ కూడా పాకిస్థాన్‌పై ప్రతీకార దాడి చేయాలంటూ డిమాండ్ వస్తోంది.పహల్గామ్ ఉగ్రవాద దాడిలో దాదాపు 8-10 మంది ఉగ్రవాదులు పాల్గొన్నట్లు సమాచారం. 5-7 మంది ఉగ్రవాదులు పాకిస్తాన్‌కు చెందినవారని అనుమానిస్తున్నట్లు తెలుస్తోంది.దాడి చేసింది తామేనని ది రెసిస్టెన్స్ ఫ్రం ట్(టీఆర్ ఎఫ్) ప్రకటించింది. ఈ ఉగ్రవాదులంతా కేవలం పురుషులను మాత్రమే టార్గెట్ చేసుకున్నారు. మహిళలు, పిల్లల్ని ఏమి చేయలేదు. వారి జోలికి కూడా రాలేదు. ఒకవేళ అడ్డొచ్చినా.. ఏమీ చేయలేదు. ఇక ముస్లిమా కాదా? అని వివరాలు అడిగి తెలుసుకున్నాకే కాల్చారు. ఐడీ కార్డులో పేరు చూసి మరీ కాల్చేశారని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు.పర్యాటక కేంద్రమైన పహల్గామ్‌లో మంగళవారం మధ్యాహ్నం జరిగిన కాల్పుల్లో ఇద్దరు విదేశీయులు సహా 28 మంది మరణించారు. యూఏఈ, నేపాల్‌కు చెందిన ఇద్దరు విదేశీయులు ఉన్నట్లు స్థానిక అధికారులు తెలిపారు. ఇక ఈ ఉగ్ర దాడిని ప్రపంచ దేశాలు తీవ్రంగా ఖండించాయి. భారత్‌కు అండగా ఉంటామని అమెరికా, రష్యా, ఇజ్రా యెల్ ప్రకటించాయి. ఇక సౌదీ అరేబియా పర్యటనలో ఉన్న ప్రధాని మోడీ.. ఉగ్ర దాడి వార్త తెలుసుకున్న వెంటనే హుటాహుటినా భారత్‌కు బయల్దేరి వచ్చేశారు.

## పెహల్‌గామ్ నరమేధానికి ప్రధాన సూత్రధారి ఇతనే..!

జమ్ము: జమ్ము కశ్మీర్‌లోని ప్రముఖ పర్యాటక ప్రాంతం పెహల్‌గామ్ ఉగ్రదాడి వెనుక పాకిస్థాన్‌కు చెందిన నిషేధిత ఉగ్రవాద సంస్థ లష్కరే తోయిబా టాప్ కమాండర్ హస్తం ఉన్నట్లు తెలిసింది. ఈ మారణహోమానికి ప్రధాన సూత్రధారిగా సైఫుల్లా కసూరి అలియాస్ ఖలీద్‌ను గుర్తించారు. ఉగ్రదాడికి అతడే ప్లాన్ చేసినట్లు సంబంధిత వర్గాలు తాజాగా వెల్లడించాయి.పాక్‌లోని పంజాబ్ ప్రావిన్స్‌కు చెందిన ఖలీద్‌ను కరుడుగట్టిన ఉగ్రవాదిగా ఎన్ఐఏ పేర్కొంటోంది. ప్రస్తుతం అతడు ఇస్లామాబాద్ కేంద్రంగా ఉగ్రకార్యకలాపాలు చేపడుతున్నట్లు సమాచారం. ఐఎస్ఐ, పాక్ ఆర్మీతో ఇతడికి సన్నిహిత సంబంధాలు ఉన్నట్లు సమాచారం. ఖలీద్‌తోపాటు ఈ దాడికి ప్లాన్ చేసిన వారిలో పీవోకేకి చెందిన ఇద్దరు వ్యక్తులు హస్తం ఉందని నిఘా సంస్థలు గుర్తించినట్లు జాతీయ మీడియా పేర్కొంది.మంగళవారం మధ్యాహ్నం సమయంలో మినీ స్విట్జర్లాండ్‌గా పేరొందిన బైసరన్ ప్రాంతంలో ప్రకృతి అందాలను ఆస్వాదిస్తున్న పర్యాటకులపై అడవిలో నుంచి హఠాత్తుగా ప్రత్యక్షమైన ఉగ్రవాదులు విచక్షణారహితంగా కాల్పులు జరిపారు. మహిళలు, పిల్లలను వదిలిపెట్టి కంటికి కనిపించిన పురుషులను కాల్చుకుంటూ పోయారు. ఈ దాడిలో సుమారు 28 మంది టూరిస్ట్‌లు ప్రాణాలు కోల్పోయారు. ముగ్గురు, నలుగురు ఉగ్రవాదులు ఈ ఘాతుకానికి పాల్పడినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.మరోవైపు ఉగ్రదాడి ఘటన ప్రాంతానికి చేరుకున్న జాతీయ దర్యాప్తు సంస్థ ఎన్ఐఏ అధికారులు కీలక ఆధారాలను సేకరించారు. మరోవైపు ఈ నరమేధానికి పాల్పడిన నలుగురు ఉగ్రవాదుల ఫొటోను భద్రతా సంస్థ తాజాగా విడుదల చేసింది. అందులో ముగ్గురి



పేర్లు ఆసిఫ్ ఫౌజీ, సులేమాన్ షా, అబు తల్హాగా గుర్తించారు. ఆసిఫ్ ఫౌజీ పాక్ ఆర్మీ రిటైర్డ్ జవాన్‌గా దర్యాప్తు సంస్థ గుర్తించింది. ఈ నలుగురు పాక్‌కు చెందిన లష్కరే తోయిబాతో సంబంధాలు కలిగి ఉన్నట్లు దర్యాప్తు సంస్థలను ఊటంకిస్తూ జాతీయ మీడియాలో వరుస కథనాలు వస్తున్నాయి.ఈ నలుగురిలో ఇద్దరు విదేశీలుగా భావిస్తున్నారు. ఈ ఘాతుకానికి పాల్పడిన వారిలో పాక్ ఆర్మీ రిటైర్డ్ జవాన్ ఉండటంతో.. ఈ దాడి వెనుక పాక్ కుట్ర ఉన్నట్లు బట్టబయలైంది. ఉగ్రదాడి జరిగిన ప్రాంతానికి చేరుకున్న ఎన్ఐఏ బృందం ముష్కరులు వాడిన భాష, ఇతర వివరాలను ప్రత్యక్ష సాక్షుల నుంచి సేకరించారు. టెర్రరిస్టులు దాడి సమయంలో పష్తూన్ భాషలో మాట్లాడినట్లు గుర్తించారు. ఈ నలుగురు ముష్కరులు మరో ముగ్గురు స్థానికులు సహకరించినట్లు తేలింది.

## మృతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా.. రూ.10లక్షలు ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం



న్యూఢిల్లీ,పహల్గామ్ మృతుల కుటుంబాలకు జమ్మూకాశ్మీర్ ప్రభుత్వం సాయం ప్రకటించింది. ఒక్కొక్క కుటుంబానికి రూ. 10లక్షల చొప్పున రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఇక క్షతగాత్రులకు రూ.లక్ష చొప్పున సాయం ప్రకటించింది. మంగళవారం మధ్యాహ్నం పహల్గామ్‌లో జరిగిన దాడిలో ఇద్దరు విదేశీయలతో పాటు 26 మంది ప్రాణాలు కోల్పోయారు. కేవలం పురుషులను మాత్రమే టార్గెట్ చేసుకున్నారు. మహిళలను, చిన్నారులను విడిచి పెట్టేశారు. ఇక ఈ ఘటనలో ఎక్కువగా కొత్తగా పెళ్లైన వారే ఉండడం విశేషం.ప్రస్తుతం ఉగ్రవాదుల కోసం భద్రతా దళాలు జల్లెడ పడుతున్నాయి. కాశ్మీర్‌లో హై టెన్షన్ వాతావరణం నెలకొంది. ఇక సంఘటనాస్థలిని కేంద్ర హోంమంత్రి అమిత్ షా సందర్శించారు. అలాగే బాధిత కుటుంబాలను ఓదార్చారు. అండగా ఉంటామని హామీ ఇచ్చారు.ఇక సౌదీ అరేబియా పర్యటనలో ఉన్న ప్రధాని మోడీ.. హుటాహుటినా భారత్‌కు వచ్చేశారు. ఉన్నతాధికారులతో సమావేశమై తాజా పరిస్థితులపై చర్చిస్తున్నారు. ఇక సాయంత్రం కేంద్ర కేబినెట్ భేటీ కానుంది. ఈ సమావేశంలో భవిష్యత్ కార్యాచరణపై చర్చించనున్నారు. అనంతరం అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి కేంద్ర కేబినెట్ నిర్ణయాలను తెలియజేయనున్నారు.పహల్గామ్ ఉగ్రవాద దాడిలో దాదాపు 8-10 మంది ఉగ్రవాదులు పాల్గొన్నట్లు సమాచారం. 5-7 మంది ఉగ్రవాదులు పాకిస్తాన్‌కు చెందినవారని అనుమానిస్తున్నట్లు తెలుస్తోంది. దాడి చేసింది తామేనని ది రెసిస్టెన్స్ ఫ్రంట్(టీఆర్ఎఫ్) ప్రకటించింది. ఈ ఉగ్రవాదులంతా కేవలం పురుషులను మాత్రమే టార్గెట్ చేసుకున్నారు. మహిళలు, పిల్లల్ని ఏమి చేయలేదు. వారి జోలికి కూడా రాలేదు. ఒకవేళ అడ్డొచ్చినా.. ఏమీ చేయలేదు. ఇక ముస్లిమా? కాదా? అని వివరాలు అడిగి తెలుసుకున్నాకే కాల్చారు. ఐడీ కార్డులో పేరు చూసి మరీ కాల్చేశారని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు.ఉగ్ర దాడిని ప్రపంచ దేశాలు తీవ్రంగా ఖండించాయి. భారత్‌కు అండగా ఉంటామని అమెరికా, రష్యా, చైనా, నేపాల్, ఇరాన్, ఇటలీ, ఇజ్రాయెల్ ప్రకటించాయి. ఇక అమెరికా అధ్యక్షుడు ట్రంప్.. మోడీకి ఫోన్ చేసి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

## పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు : ఎమ్మెల్యే వీరేశం

కట్టంగూర్, ఏప్రిల్ 23 : అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇస్తామని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీనివాస్‌తో కలిసి బుధవారం కట్టంగూర్ మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఇందిరమ్మ ఇంటి నమూనా నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం పని చేస్తుందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రతి గ్రామానికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని తెలిపారు.నిరుపేదలకు సొంతింటి కల నెరవేరబోతుందని, ఇళ్ల స్థలం ఉన్న ప్రతి ఒక్కరికి ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం నాలుగు విడుతలుగా రూ. 5 లక్షలు ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీఓ యారాల అశోక్ రెడ్డి, హౌసింగ్ డీఈ రామకృష్ణారెడ్డి. మండల ప్రత్యేక అధికారి కోటేశ్వర్ రావు, ఎంపీడీఓ పె



రుమాళ్ల జ్ఞాన ప్రకాశ్‌రావు, ఎంపీఓ చింతమల్ల చలపతి, మాజీ జడ్పీటీసీలు మాద యాదగిరి, సుంకరబోయిన నర్సింహ్మా, మాజీ ఎంపీపీలు కొండ లింగస్వా

## ఉగ్రవాదులను ఏరివేయడంలో అజిత్ దోవల్ దిట్ట..

న్యూఢిల్లీ,సౌదీ అరేబియా పర్యటనను ముగించుకుని భారతదేశానికి తిరిగి వచ్చిన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, జమ్మూ కశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఘోర ఉగ్రవాద దాడి నేపథ్యంలో వెంటనే చర్యలు చేపట్టారు.ఢిల్లీ పాలం విమానాశ్రయంలో దిగిన కొద్ది క్షణాల్లోనే, ఆయన జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్, విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్ జైశంకర్, విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీతో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో, నాయకులు ప్రస్తుత గ్రౌండ్ రిపోర్టులు, కొనసాగుతున్న భద్రతా కార్యకలాపాలు, ఈ దాడి దౌత్యపరమైన పరిణామాలపై లోతైన చర్చలు జరిపారని ఆయా వర్గాలు తెలిపాయి. భద్రతా వ్యవస్థను మరింత బలోపేతం చేయడం, బాధితులకు సహాయం అందించడం, ఈ దాడి వెనుక ఉన్నవారిని గుర్తించి తగిన చర్యలు తీసుకోవడంపై దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ప్రధానమంత్రి ఈ తక్షణ స్పందన దేశ ప్రజలకు భరోసాను ఇస్తోందని చెప్పవచ్చు. ఈ సమావేశం ద్వారా, భారత ప్రభుత్వం ఉగ్రవాదాన్ని ఎదుర్కొనేందుకు తన సంసిద్ధతను, దృఢ నిశ్చయాన్ని కల్గి ఉందని స్పష్టం చేసింది. జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ వ్యూహంపై ఆసక్తి నెలకొంది. పాక్ ప్రభుత్వం, ఉగ్ర కార్యకలాపాలపై ఆయనకు మంచి పట్టుకుంది. ఉగ్రవాదులను ఏరివేయడంలో అజిత్ దిట్ట. ఆయన నెక్ట్స్ ప్లాన్ ఏంటని అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

ఎవరీ అజిత్ దోవల్..?

అజిత్ దోవల్.. ప్రస్తుతం దేశ వ్యాప్తంగా ప్రముఖంగా వినిపిస్తున్న పేరు. యుద్ధ వ్యూహాల్లో దిట్ట అయిన దోవల్.. ప్రస్తుతం పాకిస్థాన్ ఉగ్రవాదుల దాడుల నేపథ్యంలో ఆయన కీలకంగా వ్యవహరించనున్నారు. గతంలో అనేక ఆపరేషన్లలో చాకచక్యంగా నిర్వహించిన దోవల్.. ఇప్పుడు కూడా అదే రీతిలో వ్యూహాలతో ముందుకు సాగనున్నారు. ఐపీఎస్ అధికారి అయిన దోవల్ గతంలో భద్రతాపరమైన చాలా ఆపరేషన్లను స్వయంగా నిర్వహించారు. భారత



ఇంటెలీజెన్స్, లా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారిగా కూడా ఆయన పని చేశారు. 1988 పంజాబ్‌లోని అమృత్‌సర్ నగరంలోని ఒక ప్రార్థనామందిరంలోని ఉగ్రవాదులను ఏరివేసేందుకు భద్రతాదళాలు ఆపరేషన్ బ్లాక్‌థండర్‌ను ప్రారంభించాయి. అయితే ఉగ్రవాదులు ఎందరు ఉన్నారో అంతుబట్టడం లేదు. ఆ సమయంలో ఐపీఎస్ అధికారి అయిన దోవల్.. రిక్షా కార్మికుని వేషంలో లోపలికి వెళ్లి ఉగ్రవాదులకు నచ్చజెప్పి భద్రతాదళాలకు లొంగిపోయేలా చేశారు. దీంతో ఎలాంటి ప్రాణ నష్టం జరగకుండా ఆపరేషన్ విజయవంతంగా ముగిసింది.మౌనంగా తనపనిని తాను చేసుకొని వెళ్లే దోవల్ వ్యూహాల్లో దిట్ట. పాక్‌ను ఏకాకి చేసేందుకు ఆయన అంతర్జాతీయంగా అన్నియత్నాలు ప్రారంభించారు. గతంలో పాక్‌లోని భారత దౌత్యకార్యాలయంలో సిబ్బందిగా ఏడు సంవత్సరాలు బాధ్యతలు నిర్వహించారు. సంక్లిష్ట సమయాల్లో ఆయన తీసుకునే నిర్ణయాలు దేశానికి కీలకంగా మారుతున్నాయి. పఠాన్‌కోట్‌పై పాక్ ప్రేరేపిత ఉగ్రవాదులు దాడులు చేస్తున్న సమయంలో వారిని ఏరివేసే యత్నాల్లో వున్న భద్రతాదళాలను సమన్వయపరిచారు.

## పొలిటికల్ పార్టీలు,ప్రజా సంఘాలు కలిసి రావాలి..!



న్యూఢిల్లీ,: జమ్మూ కాశ్మీర్ లోని పహల్గామ్ లోయలో పర్యాటకులపై జరిగిన దారుణమైన ఉగ్రదాడిని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ జనరల్ సెక్రెటరీ దత్తాత్రేయ హొసబలే తీవ్రంగా ఖండించారు.ఈ సంఘటన హృదయాన్ని కలిచి వేసిందన్నారు. ఉగ్ర దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి, మేము నివాళులు అర్పిస్తున్నాం.. గాయపడిన పర్యాటకులు త్వరగా కోలుకోవాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నామని పేర్కొన్నారు. మన దేశ ఐక్యత, సమగ్రతపై జరిగిన దాడి ఇది.. రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు తమ అభిప్రాయ భేదాలను పక్కన పెట్టి ఈ ఉగ్రదాడిని ఖండించాలి అని ఆర్ఎస్ఎస్ జనరల్ సెక్రెటరీ దత్తాత్రేయ హొసబలే పిలుపునిచ్చారు.అయితే, బాధిత కుటుంబాలకు కేంద్ర ప్రభుత?ం అవసరమైన సహాయాన్ని అందించాలి అని ఆర్ఎస్ఎస్ జనరల్ సెక్రెటరీ హొసబలే కోరారు. ఇక, బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించేలా ప్రభుత్వం కృషి చేయాలి అని డిమాండ్ చేశారు. ఈ దాడులకు పాల్పడిన వారిని ఎవరినీ కూడా వదిలి పెట్టే ప్రసక్తి లేదు అన్నారు. చెసిన తప్పుకు నిందితులు శిక్ష అనుభవించి తీరాలని దత్తాత్రేయ హొసబలె పేర్కొన్నారు.

## ఈ ఉగ్రదాడికి కారణం అదే.. అసదుద్దీన్ ఒవైసీ సంచలన ఆరోపణ!

హైదరాబాద్,జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఘోరమైన ఉగ్రవాద దాడికి నిఘా వైఫల్యమే కారణమని ఎంఐఎం చీఫ్ అసదుద్దీన్ ఒవైసీ ఆరోపించారు. ఈ దాడిని ఊచకోతగా ఆయన అభివర్ణించారు.బుధవారం హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడారు. ఇది ఉరి ప్రాంతం, పుల్వామా సంఘటనల కంటే ప్రమాదకరమైందని, బాధాకరమైందన్నారు. ఈ సంఘటనపై నరేంద్ర మోడీ ప్రభుత్వం జవాబుదారీతనంగా వ్యవహరించాని డిమాండ్ చేశారు."పహల్గామ్‌లో మతం అడిగిన తర్వాత ఉగ్రవాదులు అమాయక ప్రజలను విచక్షణారహితంగా చంపారు. దీనిని మేము తీవ్రంగా ఖండిస్తున్నాం. ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని మేము ఆశిస్తున్నాం. మరో ముఖ్యమైన విషయం కూడా ఉంది. ఈ ఘటనకు నిఘా వైఫల్యమే కారణం" అని ఒవైసీ హైదరాబాద్‌లో విలేకరులతో అన్నారు. ఈ ఉగ్రవాదులందరికీ ప్రభుత్వం గుణపాఠం నేర్పుతుందని, బాధిత కుటుంబాలకు వీలైనంత త్వరగా న్యాయం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.జమ్మూకశ్మీర్‌లో జరిగిన ఉగ్రమూకల దాడిపై ఎమ్ఐఎమ్ పార్టీ అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ నిన్న కూడా స్పందించారు. ఆర్మీ దుస్తుల్లో వచ్చి అమాయకులను చంపడం దుర్మార్గమైన చర్య అన్నారు.



టూరిస్టులపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. నిందితులను కఠినంగా శిక్షించాలని కేంద్రానికి సూచించారు. కాగా, మంగళవారం అనంత్‌నాగ్ జిల్లా పహల్గాంలో పర్యటిస్తున్న పలువురు పర్యటకులపై ఉగ్రవాదులు ఒక్కసారిగా కాల్పులకు తెగబడ్డారు. మినీ స్విట్జర్లాండ్‌గా పేర్కొనే పహల్గాంలోని బైసరన్ ప్రాంతాన్ని లక్ష్యంగా చేసుకొని అటాక్ చేశారు. ఈ ఘటనలో 28 మంది మరణించినట్లు సమాచారం.

## కాంగ్రెస్ పార్టీ సిద్ధాంత ప్రచారం.. గ్రామస్థాయి నుంచే జరగాలి..



హైదరాబాద్,హైదరాబాద్ లో పరిశీలకుల సమావేశం ముగిసింది. జిల్లాకు ఇద్దరు పరిశీలకుల కేటాయించారు. మండల అధ్యక్షుల ఎంపికకు ఐదుగురి పేర్లు..బ్లాకు కాంగ్రెస్ కి ముగ్గురు పేర్లు పీసీసీకి ఇవ్వాలి.. 70 మంది పరిశీలకులకు ఆహ్వానం పంపించాలని ఏఐసీసీ ఇంచార్జి మీనాక్షి నటరాజన్ తెలిపింది. ఈ సమావేశానికి ఆలస్యంగా వచ్చిన వాళ్ళను పరిశీలకులుగా పీసీసీ తొలగించింది. మీటింగ్ కి రాని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరితో పాటు మరో ఐదుగురు నేతలు.. పరిశీలకుల నుంచి వీళ్ళను తొలగించాలని మీనాక్షి నటరాజన్ ఆదేశాలు జారీ చేసింది. ఇక, 2017 నుంచి పార్టీలో ఉన్న వాళ్ళనే కమిటీలో ఉండాలని తెలిపింది. అలాగే, మహిళల ప్రాతినిధ్యం పెంచుకోవాలి.. ఏప్రిల్ 25 నుంచి 30వ తేదీ వరకు జిల్లా స్థాయి సమావేశాలు జరగనున్నాయని ప్రకటించింది.ఈ సందర్భంగా ఏఐసీసీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ మాట్లాడుతూ.. బ్రిటిష్ వాళ్ళతో కూడా కాంగ్రెస్ పార్టీ పోరాటం చేసింది.. కాంగ్రెస్ పార్టీ విస్తృత భావజాలం ఉన్న పార్టీ.. కాంగ్రెస్ జాతీయ పార్టీ జాతీయ స్థాయి ఆలోచనలతో పార్టీ పని చేస్తుంది..పార్టీ సిద్ధాంత ప్రచారం, సంస్థాగత పటిష్టత గ్రామస్థాయి నుంచి జరగాలి అని సూచనలు చేసింది.ఈ విషయంలో పార్టీ నాయకత్వం చాలా చిత్తశుద్ధితో సీరియస్ గా పని చేయాలని హెచ్చరించింది. ఈ దేశంలోనే మొదటి సరిగా తెలంగాణలో కుల ఘణన చేసి 42 శాతం రిజర్వేషన్లు, ఎస్సీ వర్గీకరణ చేపట్టడం చరిత్రాత్మక నిర్ణయం అన్నారు.అలాగే, దేశంలో ఎక్కడా లేని విధంగా అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టింది.. అయితే, దేశంలో మోడీ సర్కార్,గత రాష్ట్ర ప్రభుత్వం చేపట్టని సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు మన ప్రభుత్వం చేపట్టింది.. ప్రభుత్వం విప్లవాత్మకంగా చేపట్టిన కార్యక్రమాలను మనం ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలి అని పేర్కొన్నారు.

సంపాదకీయం

గురువారం 24-04-2025

# ఎన్నాళ్లీ ఉచిత భూ పందేరాలు !

రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న భూ పందేరాలు సామాన్యులకు సంకటంగా మారుతున్నాయి. పేరుకు పరిశ్రమల యాజమాన్యాలకు కట్టబెడుతున్నా..తదుపరి కాలంలో ఇవి వ్యాపారానికి మార్చుకుంటున్నారు. ప్రజాప్రయోజనాలు పక్కకు పోతున్న తీరును పట్టించుకోవడం లేదు. ఇటీవల హైదరాబాద్ కంచెగచ్చిబౌలి లో 400 ఎకరాల భూ వివాదం ఈ కోవలోనిదే. గతంలో ఈ భూమిని ఓ పారిశ్రామిక వేత్తకు అప్పగించారు. దానిని కోర్టు ద్వారా తిరిగి స్వాధీనం చేసుకున్నారు. కానీ కాంగ్రెస్ ఇక్కడ చిత్తశుద్ది ప్రదర్శించకుండా మళ్లీ అమ్మకానికి సిద్దపడింది. ఈ క్రమంలో సుప్రీం కోర్టు జోక్యం చేసుకోవడంతో సమస్య తీవ్రత తెలిసింది. ప్రభుత్వాలు తమ అవసరాలు లేదా ఉచిత పథకాల కోసం ఇష్టారీతిన భూములను కట్టబెడుతున్నారు. ప్రపంచాలు తిరుగుతూ రండి పెట్టుబడి పెట్టండి..భూములు ఇస్తాం..విద్యుత్ ఇస్తాం..నీరు ఇస్తాం అని ప్రాచారాలు సాగిస్తున్నారు. విశాఖలో గత వైకాపా ప్రభుత్వం అనుసరించిన రీతినే తాజాగా టిడిపి ప్రభుత్వం అనుసరిస్తోంది. ఇప్పటికే రామానాయుడు స్టుడియోకు కేటాయించిన భూముల్లో కమర్షియల్ కార్యకాలా పాల కారణంగా 15 ఎకరాల వరకు వెనక్కి తీసుకుంటూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. అయితే తాజాగా టిసిఎస్‌కు భూములు కట్టబెట్టడం, అదికూడా అత్యంత చౌకకు అందచేయడం వివాదంగా మారింది. దీనిని విపక్ష వైకాపా కూడా వ్యతిరేకించింది. రాష్ట్ర ఆర్థిక రాజధానిగా పేరొందిన విశాఖ నగరంలోని రుషికొండ ప్రాంతంలో ఎకరం కేవలం 99 పైసల చొప్పున టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ టిసిఎస్‌కు 21.16 ఎకరాల భూమిని రాష్ట్ర ప్రభుత్వం అప్పనంగా అప్పగించడం దారుణం. 99 పైసలకు ఎకరా ఎలా అప్పగిస్తారన్నదే సమస్య. రుషికొండలో భూమి విలువ రాష్ట్ర రిజిస్ట్రేషన్ శాఖ రేట్ల ప్రకారం ఒక చదరపు గజం రూ.30 వేలు ప్రాతిపదికగా తీసుకున్నా ఒక ఎకరం సుమారు రూ.15 కోట్లు. అంటే, టిసిఎస్‌కు ఇచ్చిన 21.16 ఎకరాల భూమి సుమారు రూ.320 కోట్లకు మించి ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వం 2012లో జారీ చేసిన జిఓఎంఎస్ 571 ప్రకారం ప్రభుత్వ భూములను ప్రైవేట్ సంస్థలకు ఇవ్వరాదు. 2జి స్పెక్ట్రమ్ కేసులో, ఇతర కేసుల్లో ప్రభుత్వ భూముల వంటి ప్రకృతి వనరుల విషయంలో ప్రభుత్వం ప్రజల ట్రస్టీగా మాత్రమే వ్యవహరించాలని, ఆ భూములను ప్రజా ప్రయోజనాలకు మాత్రమే ఉపయోగించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రైవేట్ సంస్థలకు మార్కెట్ ధర కన్నా తక్కువకు ఇవ్వకూడదని సుప్రీంకోర్టు స్పష్టంగా ఆదేశాలిచ్చిన విషయం అందరికీ తెలిసిందే! కనుక రాష్ట్ర ప్రభుత్వ విధానాలనేగాక సుప్రీంకోర్టు ఉత్తర్వులను కూడా టిడిపి కూటమి సర్కారు ఉల్లంఘించినట్లే. ఒక్క 2024 ఏడాదిలో టిసిఎస్ రూ.62,165 కోట్ల లాభం గడించగా అటువంటి కంపెనీకి 99 పైసల లీజుకు విలువైన ప్రభుత్వ భూమిని ముట్టజెప్పడం హాస్యాస్పదం. నిజానికి భూములను ప్రైవేట్ సంస్థలే కొనుగోలు చేయించేలా చూడాలి. 99 పైసలకు ఇవ్వడమన్నది ఎక్కడి విధానమో చంద్రబాబు కూటమి ప్రభుత్వం వివరణ ఇవ్వాలి. నయా ఉదారవాద విధానాల్లో ముఖ్యాంశమైన ఆశ్రిత పెట్టుబడిదారీ విధానం అమలుకు ఇది తాజా ఉదాహరణ. ఈ నిర్ణయం ప్రజా ప్రయోజనాలకు విరుద్ధమన్న మేధావుల విమర్శలు పట్టించుకోవడం లేదు. ఇంత చౌకగా ఊమిని కట్టబెట్టడం, అదీ టిసిఎస్ లాంటి సంస్థకు కట్టబెట్టడం అసవరమా అన్నది ఆలోచనచేయాలి. ఆ భూ పందేరాన్ని రాష్ట్ర ప్రభుత్వం తక్షణం రద్దు చేయడం అవసరం. ఆ ప్రాంతంలో టిసిఎస్ కంపెనీ ఒక ఐటి పరిశ్రమను పెట్టి 12 వేల ఉద్యోగాలు కల్పిస్తుందని రాష్ట్ర ప్రభుత్వం గొప్పగా చెబుతోంది కానీ గతంలో చాలా కంపెనీల యజమాన్యాలు పెట్టుబడులు పెడతామని, ఉద్యోగాలు ఇస్తామని హామీనిచ్చి చౌకగా ప్రభుత్వ భూములు తీసుకున్నారేతప్ప యువతకు ఉద్యోగాలు కల్పించలేదు. భూములు ప్రైవేటు కంపెనీల ఆధీనంలోనే ఉండడమేగాక వాటిని బ్యాంకుల్లో కుదువబెట్టి భారీగా రుణాలు తీసుకుని, ఆ తరవాత వాటినీ ఎగ్గొట్టిన ఉదంతాలెన్నో ఉన్నాయి. అనంతపురం లేపాక్షి మొదలు ఒంగోలు వాన్‌పిక్ శ్రీకాకుళం జిల్లా థర్మల్ కేంద్రాల వరకూ వేల ఎకరాల భూములు కార్పొరేట్ కంపెనీల కబంధ హస్తాల్లో చిక్కుకున్న విషయం చంద్రబాబుకు తెలియందికాదు. డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్ కూడా ఇలాంటి పందేరాలు చూస్తూ ఉండడం సరికాదు. వందలు, వేల ఎకరాలను సంపన్నులకు కట్టబెట్టే ప్రభుత్వ పెద్దలు ఒక్క సెంటు– జాగా కూడా పేదలకు ఇవ్వరు. పేదల ఇళ్లకు మాత్రం మీనమేషాలు లెక్కబెడతారు. పడావు భూముల్లో గుడిసెలు వేసుకుంటే వాటిని కూల్చి అరెస్టు చేయమని, లాఠీలకు పని చెప్పమనీ పోలీసులను పురమాయిస్తారు. ప్రజల సొత్తును, ప్రకృతి సంపదను అధికారంలో వున్నవారు తమ అనుయాయులకు కట్టబెట్టే ఆశ్రిత పెట్టుబడిదారీ విధానం దాదాపు గత నాలుగు దశాబ్దాలుగా అమలవుతోంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు, వైఎస్ హయాంలో ఇలాంటి పందేరాలు సాగాయి. ఇప్పుడు చంద్రబాబు మరోమారు తన గారడీ ప్రదర్శిస్తున్నారు. రేవంత్ సరకార్ తెలంగాణ కూడా ఫార్మాపేరుతో ఇలాగే వ్యవహరిస్తోంది. అలాగే గత కెసిఆర్ ప్రభుత్వం కూడా ఇదే పెదధోరణిని సాగించింది. ఇప్పుడేమో భూముల పందేరంపై నంగనాచిలా కొట్లాట చేస్తోంది. భూములను కట్టబెట్టడంలో అంతా ఒకే తాను ముక్కలన్నది ప్రజలు గ్రహించాలి. ఇకపోతే ఉమ్మడి ఎపిలో 2006 నుండి 2011 మధ్య 88,492 ఎకరాల భూమిని వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వం 1,027 వివిధ కంపెనీలకు కట్టబెట్టింది. తద్వారా రాష్ట్ర ఖజానా అక్షరాలా లక్ష కోట్ల రూపాయల ఆదాయాన్ని కోల్పోయిందని కాగ్ తేల్చింది. ఈ విధానాలను దేశంలోకి తెచ్చిందే కాంగ్రెస్ పార్టీ కాగా ప్రస్తుతం ఓడరేవుల మొదలు విమానాశ్రయాలను సైతం అదానీ, అంబానీలకు కట్టబెడుతున్న బిజెపి కేంద్ర ప్రభుత్వ తీరు చూస్తూనే ఉన్నాం. గంగవరం పోర్టు కోసం పోరాటం చేసి భూములు అప్పగించిన వారు ఇప్పుడు నిరాశ్రయులయ్యారు. కానీ ఆ భూములను, పోర్టును ఆదానీ ఎగురేసుకు పోయారు. కారుచౌకగా భూములు అప్పగించడం, అనుచితమైన రాయితీలివ్వడం, చట్టాలను సడలించే విధానాలతో వచ్చే పెట్టుబడులు రాష్ట్రానికిగానీ, ప్రజలకుగానీ దీర్ఘకాలికమైన ప్రయోజనాలు కలిగించిన దాఖలాలు లేవు. టిసిఎస్ విశాఖలో 12 వేల ఉద్యోగాలు కల్పిస్తామన్నా ప్రస్తుతం అంతర్జాతీయ ఆర్థిక పరిస్థితి దృష్ట్యా ఇతర ఐటి కంపెనీలతో పాటు– ఉద్యోగుల సంఖ్య తగ్గించే దిశలో ఆ కంపెనీ కూడా ఉంది. ఈ విషయాలన్నిటినీ దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం టిసిఎస్ విషయంలో తన నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలి. రుషికొండలోని ప్రభుత్వ భూమిని మార్కెట్ ధరకు కేటాయించి, ఆదాయాన్ని రాబట్టుకోవాలి.

# మద్దతు ధరలు..ధాన్యం సేకరణ..ఓ మిథ్య !

హైదరాబాద్,ఏటా ధాన్యం సేకరన ఓ ప్రహసనంగా మారింది. ధాన్యం పండిస్తున్న అన్నదాతలను అభినందించి, ధాన్యం సేకరించాల్సన ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిసతున్నాయి. ధాన్యం కొనుగోళ్లకు ఏర్పాట్లు చేశామని ప్రభుత్వాలు చెప్పడం. క్షేత్రస్థాయిలో అలాంటి ఏర్పాట్లు పెద్దగా లేకపోవడం గమనించవచ్చు. నేటికీ సమగ్ర వ్యవసాయ విధానంపై కేం÷–దరం కూడా ఆలోచన చేయడం లేదు. దీనిపై సమగ్రంగా చర్చించాలన్న ధోరణి కానరావడం లేదు. దేశంలోని అన్నదాతలను ఆదుకోవడంతో పాటు.. దేశానికి అన్నం పెట్టాలన్న దూరదృష్టి నేతల్లో కొరవడింది. ఏం చేస్తే దేశంలో ప్రజలందరికి ఆహార ధాన్యాలు దక్కగలవో చర్చించడం లేదు. పంటలు పండుతున్నా అందరికీ ఆహారాధాన్యాలు నేటికీ అందుబాటులోకి రావడం లేదు. సాగుచట్టాలను రద్దు చేసిన తరవాత కూడా ప్రధాని మోడీ ఈ సమస్యల పై చర్చించడం లేదు. అన్నదాతల ఆదాయం రెట్టింపు చేస్తానన్న హామీలు మాటలకే పరిమితం అయ్యాయి. సన్నకారు రైతులకు అండగా ఉన్నానని,ఏటా 6వేల కోట్లు వారి ఖాతాల్లో వేస్తున్నానని ప్రధాని మోడీ గొప్పగా ప్రకటించు కోవడం తప్ప సమగ్ర వ్యవసాయ విధానానికి శ్రీకారం చుట్టడం లేదు. నిజానికి ఖాతాల్లో డబ్బులు వేయడం కాకుండా వ్యవసాయాన్ని ఎలా ముందుకు తీసుకుని వెళ్లాలో ఆలోచించడం లేదు. గ్రామాలను ఆధారం చేసుకుని వ్యవసాయాన్ని పాడి పరిశ్రమను, కోళ్ల పరిశ్రమను ఉమ్మడిగా అభివృద్ధి చేయాలి. దీంతో గ్రామీణ వృత్తులకు కూడా ఆసరా దక్కుతుంది. కానీ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఆ దిశగా ఆలోచన చేయడం లేదు. అకాల వర్షాల కారణంగా భారీగా పంటలు దెబ్బతింటున్న సందర్భంలో వారికి సకాలంలో పరిహారం అందడం లేదు. ప్రభుత్వ లెక్కల ప్రకారం 33 శాతానికంటే ఎక్కువ మొత్తంలో పంటలు దెబ్బతింటేనే నష్టపరిహారానికి సిఫార్సు చేసి ప్రభుత్వానికి నివేదిస్తారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం జరుగుతున్న నష్టం లెక్కల్లోకి రావడం లేదు. పంటనష్టం అంతకు మించి ఉంటేనే వ్యవసాయాధి కారులు వివరాలను సేకరించి ప్రభుత్వానికి నివేదిస్తున్నారు. గత కొన్నేళ్లుగా బీమా చేస్తున్న రైతులకు పరిహారం అందేది నామమాత్రంగానే ఉంటుంది. వేల సంఖ్యలో రైతుల పంట నష్టం జరిగినా, రైతులకు అందుతు న్నది మాత్రం తక్కువగానే ఉంటుంది. వర్షాలు కురియడం,పంటను నష్ట పోవడం కారణంగా రైతులు ఆందోళన చెందుతున్నా అందడం లేదు. బీమా నిబంధనల ప్రకారం నష్టం 33 శాతం దాటితేనే పరిహారం వచ్చే అవకాశం ఉంది. ఈ నిబంధనలను మార్చాల్సి ఉంది. ఇన్సూరెన్స్ ఉన్న రైతులందరికి పరిహారం దక్కడం లేదు. భారీ వర్షాలతో నష్టపోతే రుణాలు తీసుకున్నవారికి ఈ బీమాను అమలు చేయక పోవడంతో రైతులపై అదను భారం పడుతోంది. నిబంధనల ప్రకారం ఐదేళ్ల ఉత్పత్తి ఆధారంగా ఎంత పంటనష్టం జరిగితే అంతే మొత్తాన్ని అందించనున్నారు. అకాల వర్షాలు భారీగా పంట నష్టాన్ని కలిగించి, రైతుకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. చేతికి వచ్చిన పంటను కాపాడు కునేందుకు రైతులు ఎంత ప్రయత్నించినా సాధ్యం కావడం లేదు. అకాల వర్షాల కారణంగా పంటలు దెబ్బతింటున్నాయి. ఈ సమస్యలను అన్నీ చర్చించాలి. తెలుగు రాష్ట్రాల్లో పంట ఏదైనా అమ్ముకోవడం ఓ పెద్ద ప్రహనంగా మారింది. ధాన్యం మార్కెట్లోకి తెచ్చిన తరవాత సవాలక్ష కొర్రీలు పెట్టి రైతులను నిలువుదోపిడీ చేస్తున్నారు. చట్టసభల్లోనూ, బయటా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలనుకనీసంగా చర్చించడం లేదు. ప్రపంచానికి అన్నం పెట్టే స్థితిలో భారతదేశం ఉన్నా..వ్యవసాయ రంగాన్ని అభివృద్ది చేసేందుకు మాత్రం పాలకులు ముందుకు రావడం లేదు. పక్కా మార్కెటింగ్ వ్యవస్థ లేకపోవడం, భారీగా పండుతున్న పంటలను కొనుగోలు చేసే వ్యూహం ప్రదర్శించడం లేదు. పంటల కొనుగోలు సమయంలో సరైన వ్యూహంతో ప్రభుత్వాలు చర్య తీసుకుంటే ఇబ్బందులు రావు. కలెక్టర్లతో ఇటీవల తెలంగాన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమీక్షించి పంటల కొనుగోళ్లకు పక్కాగా చర్యలు



తీసుకోవాలని ఆదేశించారు. ఎపిలో మంత్రి అచ్చన్నాయుడు కూడా పంటల కొనుగోళ్లకు ఏర్పాట్లు చేశామన్నారు. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితులు మరోలా ఉన్నాయి. తెలంగాణలో 24 గంటల ఉచిత విద్యుత్...నీటి సరఫరా, రైతుబంధు కింద పెట్టుబడి సాయం...రైతు చనిపోతే కుటుంబాన్ని ఆదుకునేందుకు రైతుబీమా పథకం అమలవుతున్నాయి. ఇన్ని పథకాలు ప్రవేశ పెట్టి పంటలు కొనుగోలు చేయకపోతే ఎలా? పంటలు అమ్ముకోవడానికి రైతులు రోడ్డెక్కితే రాజకీయం ఎలా అవుతుంది.? గిట్టుబాటు ధరలు ఇవ్వాలని, పంటలు కొనుగోలు చేయాలని కోరుకోవడం ఏటా ఓ ప్రహసనంగా మారింది. ఇది ఒక్క తెలంగాణ సమస్య కాదు. దేశవ్యాప్తంగా ఉన్న సమస్య. సీజన్ లో సకాలంలో పంటలు కొనుగోలు చేసి డబ్బులు ముట్టచెప్పితే చాలు.. రైతు సమస్యలు సగం తీరినట్లే. కానీ మార్కెట్ యార్డుల్లో పడిగాపులే రైతులను తీవ్ర ఆవేదనకు గురిచేస్తోంది. దానికితోడు గిట్టుబాటు ధరలు రావు. అన్నీవున్నా అల్లుడి నోట్లో శని అన్నట్లుగా కొనుగోళ్ల విషయంలో అటు కేంద్రం, ఇటు రాష్ట్రం పెద్దగా కార్యాచరణ చేపట్టడంలేదు. పంట ఏదైనా డిమాండ్ ఉండదు. అమ్ము కోవడానికి అష్టకష్టాలు పడాల్సిందే. ఇకపోతే దేశంలో సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించేలా ప్రచారం కానరావడం లేదు. కొంతమంది రైతులు ఎరువులు ఎక్కువ వేస్తే దిగుబడి పెరుగుతుందని అనుకోవడం వల్ల మోతాదుకు మించి రసాయన ఎరువులు వాడుతున్నారు. దీంతో భూసారం దెబ్బతింటోంది. అలాగే ప్రజల ఆరోగ్యం కూడా దెబ్బతింటోంది. ఏటా దేశంలో రైతులు పంటలు పండించి గిట్టుబాటు ధరల కోసం రోడ్డెక్కాల్సిన దుస్థితి నెలకొంది. గిట్టుబాటు ధరలు ఇవ్వకుండా ఇతరత్రా తాయిలాలు ప్రకటిస్తూ ప్రభుత్వాలు రైతన్నలను మోసం చేస్తున్నాయి. పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని..మార్కెట్‌కు తీసుకుని వచ్చిన పంటలను సకాలంలో కొనుగోలు చేయాలన్న రైతులకు నిరాశే ఎదురవుతోంది. ప్రధానంగా వరి,కంది, మిర్చి, పత్తి, ఎర్రజొన్న, పసుపు రైతులు బాధలు వర్ణనాతీతం. ఆర్థికంగా తాయిలాలు ఇవ్వడం కాకుండా సమస్యలను చర్చించి విధానాలు రూపొందించాలి. కెసిఆర్ ప్రవేశ పెట్టిన రైతుబంధును ప్రవేశ పెట్టిన కేంద్ర ప్రభుత్వం..పంటల కొనుగోళ్లకు సంబంధించి నిర్దిష్ట విధానాలు అమలు చేయడం లేదు. మార్క్‌ఫెడ్, సిసిఐలు రంగంలోకి దిగినా ఫలితం దక్కడంలేదు. కేంద్ర ప్రభుత్వం ఈ–నామ్ అంటూ అట్టహాసంగా ప్రకటనలు చేసినా రైతులకు మేలు చేకూర్చలేదు. పంటలను గిట్టుబాటుధరకు రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ ఏటా రైతులు రోడ్డెక్కడం.. దాన్ని ప్రభుత్వాలు పట్టించుకోక పోవడం మామూలు విషయంగా మారింది.గిట్టుబాటు ధరలతో పాటు కొనుగోళ్ల కోసం పలుమార్లు ఆందోళనలు చేపట్టినా ప్రభుత్వం నుంచి స్పందన కరువవడంతో రైతులు తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు. పంటలు మార్కెట్‌కు వచ్చే సమయంలో పక్కాగా కొనుగోళు సాగాలి. గిట్టుబాటు ధరలు దక్కాలి. దళారుల మోసాలు అరికట్టాలి. అప్పుడే కొంతయినా ఊరట దక్కగలదు.

# విశాఖ చుట్టూ భూములపై కన్ను

విశాఖపట్టణం, వైకాపాను అదేపనిగా నిగ్గదీసి, విమర్శించిన అధికార కూటమి ఇప్పుడు విశాఖను అప్పనంగా మింగాలని చూస్తోంది. భోగాపురం ఎయిర్‌పోర్టుతో పాటు, ఐటి బూచి చూపి చుట్టుపక్కల భూములను కాజేయాలని అధికార టిడిపి నేతలు చూస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. విశాఖ జిల్లాలో 'ల్యాండ్ పూలింగ్' పక్రియ మళ్లీ మొదలైంది. భీమిలి అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలోని ఆనందపురం మండలం రామవరం, గంగసాని అగ్రహారంలలో రూ.వేల కోట్ల విలువైన 245 ఎకరాలను కాజేసేందుకు టిడిపి కీలక ప్రజాప్రతినిధి స్కెచ్ సిద్ధం చేశారు. ఈ భూములను తన అనుయాయులైన పారిశ్రామికవేత్తలకు కట్టబెట్టి ఆర్థిక లబ్ధి పొందాలని చూస్తున్నారు. తన వ్యూహం పక్కాగా పారేందుకు విశాఖ అర్బన్ మెట్రోపొలిటన్ రీజియన్ అథారిటీ వీఎంఆర్‌డిఎని తెరపైకి తెచ్చి నేరుగా రంగంలోకి దిగారు.2014–2019 మధ్యకాలంలో టిడిపి ప్రభుత్వం అమరావతిపై అధిక కేంద్రీకరణ చేయడంతో ఈ పనులు ఆగిపోయాయి. ఆ తర్వాత ప్రభుత్వం మారడంతో ఈ పక్రియ ముందుకు సాగలేదు. నేడు టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో భూసమీకరణ మళ్లీ ప్రారంభమైంది. ఈ నియోజకవర్గానికి చెందిన కీలక ప్రజాప్రతినిధి గతంలో ల్యాండ్ పూలింగ్‌కు అంగీకరించిన రైతులతో నేరుగా చర్చలు జరుపుతున్నారు. వీఎంఆర్‌డిఎ అధికారులూ వచ్చారని, గతంలో చెప్పిన విధంగా ఎ÷–లాట్లు– ఇస్తామని చెబుతున్నారని రైతులు తెలిపారు. తొమ్మిదేళ్ల క్రితం అప్పటి టిడిపి ప్రభుత్వం ఈ గ్రామాల్లో ల్యాండ్ పూలింగ్ పక్రియ ప్రారంభించింది. 2016 అక్టోబర్ 14న జిఒ నంబర్ 290ని తీసుకొచ్చింది. భూములను ప్లాట్లుగా మార్చి రైతులకు ఎకరాకు 900 గజాలు వీఎంఆర్‌డిఎ ద్వారా అభివృద్ధి చేసి ఇస్తామని ప్రకటించింది. అనందపుర మండలంలోని గంగసాని అగ్రహారం సర్వే 1, 2 నెంబరులో 135 ఎకరాలు, రామవరం సర్వే నెంబరు 121లో 110 ఎకరాలు చొప్పున సమీకరించేందుకు సిద్ధమైంది. ఈ భూములు 170 మంది రైతుల సాగులో ఉన్నాయి. శొంఠ్యాం గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరంలో, కనమాం–గోరంట మధ్య రోడ్డుకు అనుకొని ఉన్న ఈ ప్రాంతంలో ఎకరా భూమి కోట్ల రూపాయల్లో ఉంది. అప్పట్లో రాజకీయ దళారులు రంగ ప్రవేశం చేసి ఈ భూములకు ఎకరాకు రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకూ కొందరి రైతులకు అడ్వాన్స్‌లు ఇచ్చారు. జీడి, మామిడి తోటలు ఉన్న ఈ భూములను చదును చేసినా ప్లాట్లు వేసే పక్రియ ప్రారంభం కాలేదు. అప్పట్లో భూసమీకరణకు అంగీకరించినందున మరో ఆరు నెలల్లో రైతులకు ఎకరాకు 900 గజాల చొప్పున ఎ÷–లాట్లు– ఇస్తామని, ఈ ప్రాంత అభివృద్ధికి తోడ్పడేలా వీఎంఆర్‌డిఎ చర్యలు తీసుకుంటు–ందని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు చెబుతున్నారు. మాదాపూర్, గచ్చిబౌలి తరహాలో ఇక్కడికి ఐటి కంపెనీలు రాబోతున్నాయని ఊదరగొడుతున్నారు. గతంలో టిడిపి ఆధ్వర్యంలో ఎంవిపి కాలనీ లే అవుట్, మిథిలాపురి కాలనీ లే అవుట్లు– రూపుదిద్దుకున్నాయని, ఇదే తరహాలో గంగసాని అగ్రహారం, రామవరం అభివృద్ధి చెందనున్నాయని ఈ నెల పదిన ఈ గ్రామాల్లో పర్యటించిన ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు వీఎంఆర్‌డిఎ కమిషనర్ కెఎస్‌విశ్వనాథన్, చైర్మన్ ప్రణవ్ గోపాల్ రైతులకు చెప్పుకొచ్చారు. ల్యాండ్ పూలింగ్ కింద తీసుకోనున్న భూముల్లో ఎమ్మెల్యే గంటా భూమి పూజ చేశారు. దీనిలో వీఎంఆర్‌డి అధికారులు కూడా పాల్గొన్నారు. మొత్తానికి మళ్లీ భూముల కాజేతకు రంగం సిద్దం అయ్యిందన్న ప్రచారం సాగుతోంది.

# కొత్త శకానికి శ్రీకారం?

న్యూఢిల్లీ,భారతీయ జనతా పార్టీలో ఏమి జరుగుతోంది? జాతీయ అధ్యక్షుని ఎన్నికలో ఎందుకు ఇంత జాప్యం జరుగుతోంది? తెలంగాణ సహా అనేక ఇతర రాష్ట్రాల్లో రాష్ట్ర అధ్యక్షుల ఎన్నిక ఎందుకు ముడిపడడం లేదు? అందుకు పార్టీ నేతలు చెపుతున్న కారణాలేనా లేక ఇంకా లోతైన కారణాలు ఏమైనా ఉన్నాయా? అంటే, కమల దళంలో జరుగతున్న పరిణామాల వెనక లోతైన కారణాలే ఉన్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారంగా తెలుస్తోంది. నిజానికి పైకి కనిపిస్తున్నడా నికి లోపల జరుగుతున్న పరిణామాలకు పొంతనలేదని అంటున్నారు. అవును ఢిల్లీలో చోటు చేసుకుంటున్న పరిణామాలను గమనిస్తే.. భవిష్యత్ లక్ష్యాలు, భవిష్యత్ వ్యూహాలు ఆధారంగా ఇటు పార్టీలో, అటు ప్రభుత్వంలో అనివార్యంగా చేపట్టవలసిన పెను మార్పులపై లోతైన చర్చలు, సంప్రదింపులు జరుగుతున్నట్లు తెలుస్తోంది. అలాగే పైకి అంతా బాగుందన్నట్లు కనిపిస్తున్నా, అంతర్గతంగా అనేక అనూహ్య పరిణామాలు చోటు చేసుకుంటున్నాయని, అందుకే ఒకదానితో ఒకటి ముడి పడిన కీలక నిర్ణయాల్లో జాప్యం జరుగుతోందని అంటున్నారు. ఇటీవల అటు ఢిల్లీలో ఇటు నాగాపూర్ లో అగ్రనేతల వరస సమావేశాలు కేవలం పార్టీ అధ్యక్షుని ఎన్నికకు పరిమతం కాదని.. అంతకు మించిన అంతర్మధ నం జరుగుతోందని విశ్లేషకులు అంటున్నారు. ముఖ్యంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాగపూర్ పర్యటన (మార్చి30) తర్వాత, చోటు చేసుకుంటున్న పరిణామాలు బీజేపీలో ఏదో జరుగుతోందనే అనుమానాలకు మరింత బలం చేకూర్చే విధంగా ఉన్నాయని, అంటున్నారు. అలాగే బీజేపీ, ఆర్ఎస్ఎస్ సంబంధాల విషయంలోనూ పునఃసమీక్ష జరుగుతోందని విశ్వసనీ యంగా తెలుస్తోంది. ఆర్ఎస్ఎస్ వందేళ్ళ పండగను పురస్కరించుకుని, సంఘ్ పరివార్ ఎజెండాలో మిగిలి ఉన్న అంశాలపై మరింత దృష్టి పెట్టాలని ఆర్ఎస్ఎస్ బావి స్తోందని అంటున్నారు .అందులో భాగంగా పార్టీ పైన, ప్రభుత్వం పైన కూడా నాగపూర్ ప్రత్యక్ష పర్యవేక్షణ ఉండేలా, ఢిల్లీ పై నాగపూర్ పట్టు బిగిస్తోందని అంటున్నారు.

మళ్ళీ ఉప ప్రధాని?

ఈ నేపథ్యంలో రానున్న రోజుల్లో ఇటు బీజేపీలో, అటు ప్రభుత్వంలో భారీ మార్పులు ఉంటాయని, అంటున్నారు. ఇందులో భాగంగా, గతంలో అటల్ బిహారీ వాజ్ పేయి ప్రభుత్వంలో ఉన్న ఉప ప్రధాని పదవిని పునరుద్దరించే ఆలోచన ఉందని అంటున్నారు. వాజ్ పేయి ప్రభుత్వంలో హోం మంత్రిగా ఉన్న అద్వానీకి 2002లో ఆర్ఎస్ఎస్ ఆలోచన మేరకే పదోన్నతి లభించిందనీ, ఇప్పుడు కూడా, ఆర్ఎస్ఎస్ ఆలోచన మేరకే మళ్ళీ ఉప ప్రధాని పదవిని పునరుద్ధరించాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే.. అప్పటిలాగా ఇప్పుడు కూడా, కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు పదోన్నతి లభిస్తుందా? ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగీ ఆదిత్య నాథ్,నాగపూర్ ఎంపీ, కేంద్ర మంత్రి నితిన్ గద్కరీలలో ఒకరిని అదృష్టం వరిస్తుందా? అన్నది తెలియాల్సి ఉందంటున్నారు. నిజానికి, ప్రస్తుతం బీజేపీ ముందున్న ప్రధాన సమస్య,

ఈ రోజు ఉప ప్రధాని రేపటి ప్రధాని?

అవును. 2002లో ఉప ప్రధానిగా పదవిని చేపట్టిన అద్వానీ, 2004 ఎన్నికలలో బీజేపీ ప్రధాని అభ్యర్థిగా తెరపైకి వచ్చారు. అటల్జీ ప్రధానిగా ఉన్న సమయంలోనే అద్వానీని బీజేపీ, ఎన్డీఏ కూటమి ప్రధాని అభ్యర్థిగా ప్రకటించింది. సరే.. ఆ ఎన్నికల్లో బీజేపీ సారథ్యంలోని ఎన్డీఏ బండి తిరగబడింది. కాంగ్రెస్ సారథ్యంలోని యుపీఏ అధికారంలోకి వచ్చింది. అద్వానీ, ఐదేళ్ళు ప్రతిపక్ష నేతగా కొనసాగారు. తిరిగి 2009 లోనూ ఆయనే ప్రధాని అభ్యర్థిగా బీజేపీ బరిలో దిగింది. అయితే మళ్ళీ అదే ఫలితం ఎదురైంది. అద్వానీ మరోసారి బస్సు మిస్సయ్యారు. అది వేరే విషయం. అదలా ఉంచితే, ఇప్పుడు మళ్ళీ అదే ఆనవాయితీ కొనసాగితే, ఈ రోజు ఉప ప్రధాని ఎవరైతే వారే రేపటి (2029) ప్రధాని అభ్యర్థి అవుతారు. అందుకే. పార్టీలో ఇంతటి అంతర్మథనం సాగుతోందని, పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. అలాగే, ఆర్ఎస్ఎస్ అనుకున్నది అనుకున్నట్లు జరిగితే, మోదీ

# వైసిపి కోటలో లిక్కర్ బాంబు ..వరుస అరెస్ట్ లతో ఉక్కిరి బిక్కిరి



హైదరాబాద్ : కనిపించే మూడు సింహాలు నీతికి, న్యాయానికి, ధర్మానికి సంకేతాలైతే.. కనిపించని నాలుగో సింహమే పోలీస్.. ఇదీ 29 ఏళ్ల కిందటి సినీ డైలాగ్ సమాజంలో పోలీస్ వృత్తిని కీర్తించింది. ప్రస్తుతం సెపరేటు రూటులోకి మారింది. రాజకీయ నేతల పరదాల్లో పోలీసు అధికారి చిక్కితే.. ఏమి జరుగుతుందో.. ఎన్‌కౌంటర్ స్పెషలిస్టు.. రౌడీలకు సింహస్వప్నం.. నేరగాళ్లకు యముడిగా పేరు తెచ్చుకున్న ఐపీఎస్ అధికారి భుజంపై స్టార్లకు నేడు అవినీతికి, అన్యాయానికి, అధర్మానికి ప్రతిబింబం అనే మకిలతో మసకబారాయి. గ్రేట్ ఐపీఎస్ ఆఫీసర్ పీఎస్ఆర్ ఆంజనేయులును మంగళవారం ఉదయం హైదరాబాద్‌లో ఏపీ పోలీసులు అరెస్ట్ చేశారు. వైసీపీ ప్రభుత్వంలో ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్‌గా ఆయన పనిచేశారు. ప్రస్తుతం ముంబై నటి జత్వాని కేసులో ఆంజనేయులు నిందితుడిగా ఉన్నారు. ఏపీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజుపై థర్డ్ డిగ్రీ కేసులో కూడా ఆయనే నిందితుడు. ఈ కేసులు తనను వెంటాడుతున్నాయని గ్రహించినా.. ఆయన ఇప్పటి వరకూ ముందస్తు బెయిల్ కోసం న్యాయస్థానం తలుపులు తట్టలేదు. మెట్లు ఎక్కలేదు.

కాదంబరీ ఫస్ట్ సీక్వెల్..

వైసీపీ నేత విద్యాసాగర్ ఫిర్యాదుతో ముంబై వెళ్లి జత్వానీతో సహా ఆమె కుటుంబాన్ని అరెస్ట్ చేసిన సంఘటన ఆ సమయంలో చర్చనీయాంశంగా మారింది. ఓ ప్రముఖ వ్యాపారవేత్తపై జత్వాని కేసు వేయడంతోనే పోలీసులు ఆమెను అరెస్ట్ చేశారనే ఆరోపణలు వచ్చాయి. ఈ కేసును వాపస్ తీసుకోవాలని జత్వానీపై తీవ్ర ఒత్తిడికి గురిచేశారనే విమర్శలు తెరమీదకు వచ్చాయి. ఇబ్రహీంపట్నంలోని ఓ గెస్ట్ హౌస్ లో నిర్బంధించారని ప్రచారం జరిగింది.

ఇక కాదంబరీ– 2

సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ ఓడిపోయి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో కాదంబరీ సీక్వెల్ 2 తెరమీదకు వచ్చింది. తనపై తప్పుడు కేసు పెట్టి తనతోపాటు తన తల్లిదండ్రులను జైలు పాల్జేశారని ముంబై నటి పోలీసులపై, కుక్కల విద్యాసాగర్‌పై 2024 ఆగస్టులో కూటమి ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు. నటి ఫిర్యాదుపై విద్యాసాగర్‌తో పాటు ముగ్గురు ఐపీఎస్‌లపై విజయవాడలో కేసు నమోదు అయింది. ఈ కేసులో ఏ1గా విద్యాసాగర్, ఏ2గా పి.సీతారామాంజనేయులు (పీఎస్ఆర్), ఏ3గా కాంతిరాణా, ఏ4గా అప్పటి వెస్ట్‌జోన్ ఏసీపీ హనుమంతురావు, ఏ5గా ఇబ్రహీంపట్నం సీఐ సత్యనారాయణ, ఏ6గా విశాల్‌గున్నీ పేర్లను పోలీసులు చేర్చారు. విద్యాసాగర్‌తో అధికారులు పి.సీతారామాంజనేయులు, కాంతి రాణా, విశాల్‌గున్నీ వైస్సార్సీపీ నేత కుక్కల విద్యాసాగర్‌తో కుమ్మక్కై కాదంబరీ జత్వానీని అక్రమంగా అరెస్ట్ చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు. ఈ కేసును కూటమి సర్కార్ సీరియస్‌గా తీసుకుంది. జత్వానీ విషయంలో ఈ ముగ్గురి పాత్ర ఉందని తెలియడంతో విజయవాడ మాజీ సీపీ కాంతి రాణాటాటా, ఐపీఎస్ విశాల్ గున్ని సహా.. పీఎస్ఆర్ ఆంజనేయులుపై సస్పెన్షన్ వేటు పడింది. ఈ ముగ్గురు ఐపీఎస్ అధికారులను 2025 సెప్టెంబర్ 25వ తేదీ వరకు సస్పెన్షన్ పొడిగిస్తున్నట్లు ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ ఆదేశాలు జారీ చేశారు

క్లైమాక్స్‌లో పీఎస్ఆర్ అరెస్ట్

తన ఆస్తిపై జత్వానీ తప్పుడు ఒప్పంద పత్రాన్ని సృష్టించి, ఇతరులకు విక్రయించినట్లు 2024 ఫిబ్రవరి 2న ఇబ్రహీంపట్నం ఠాణాలో విద్యాసాగర్ ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు పెట్టారు. అయితే ఈ వ్యవహారంలో కర్త, కర్మ, క్రియ అంతా సీతారామాంజనేయులుగా పోలీసులు నిర్ధారించారు. ముఖ్య నేత చెప్పగానే రంగంలోకి దిగిన పీఎస్ఆర్%ొ% కాదంబరిపై ఏ కేసు పెట్టాలి, ఎలా అరెస్టు చేయాలి, ఎవరెవరిని భాగస్వాములను చేయాలో ఆయనే చూసుకున్నారని పోలీసుల విచారణలో వెలుగు చూసింది. దీంతో పీఎస్ఆర్‌తో పాటు కాంతిరాణా, విశాల్ గున్నీ, స్థానిక దర్యాప్తు అధికారి వరకూ అందరిపైనా ప్రభుత్వం తీవ్ర చర్యలు తీసుకుంది.

అరెస్టు చేశారిలా..

రంగారెడ్డి జిల్లా మొయినాబాద్‌లోని పీఎస్ఆర్ ఇంటి వద్ద సోమవారం సీఐడీ పోలీసులు పరిశీలించారు. దీన్ని గమనించిన పీఎస్ఆర్ బేగంపేటలోని ఆయన వియ్యంకుడి ఇంటికెళ్లారు. ఉదయం 5 గంటలకు ఆంజనేయులును సీఐడీ అరెస్టు చేసింది. అక్కడి నుంచి మొయినాబాద్‌లోని ఫామ్‌హౌస్‌కు పీఎస్ఆర్‌ను తీసుకెళ్లి సోదాలు నిర్వహించారు. తదనంతరం ఉదయం ఎనిమిదిన్నర గంటలకు సీతారామాంజనేయులును ఏపీకి తరలించారు. ఈ కేసులో ఆయన్ను పూర్తి స్థాయిలో సీఐడీ విచారించనుంది. ఈ కేసులో ఇప్పటికే ముగ్గురు ఐపీఎస్ అధికారులను సస్పెండ్? చేశారు. విజయవాడ మాజీ సీపీ కాంతిరాణాటాటా, ఐపీఎస్ విశాల్ గున్నితో పాటు ఆంజనేయులు సస్పెన్షన్‌లో ఉన్నారు.

# పారదర్శకంగా రేషన్ విధానం: నాదెండ్ల

ఏలూరు, ఏలూరు జిల్లాలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్డీయే కూటమి ప్రభుత్వ హయాంలో రాష్ట్ర వ్యాప్తంగా పారదర్శకమైన రేషన్ విధానాన్ని అమలు చేస్తున్నాం అని తేల్చి చెప్పారు. కానీ, గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ పాలనలో రాష్ట్రంలో రేషన్ మాఫియా విచ్చలవిడిగా కొనసాగింది అని ఆరోపించారు. ఇప్పుడు, రాష్ట్ర వ్యాప్తంగా పరిస్థితిని చక్కబెడుతున్నాం అన్నారు. వైసీపీ ప్రభుత్వంలో ఎంత అరాచకం జరిగిందో ప్రజలకు బాగా తెలుసు అని పేర్కొన్నారు. కాగా, పోలవరం ప్రాజెక్టును కూటమి ప్రభుత్వం పూర్తి చేస్తుంది.. నిర్వాసితులను అన్ని విధాలుగా ఆదుకుంటాం అని మంత్రి నాదెండ్ల మనోహర్ భరోసా ఇచ్చారు.

# ఏపీ నుంచి స్మృతి ఇరానీ ?



అమరావతి,ఏపీలో ఒకే ఒక రాజ్యసభ సీటుకు ఖాళీ ఏర్పడింది. ఆ ఖాళీని ఎవరితో భర్తీ చేస్తారు అన్న దాని మీద రకరకాలైన పేర్లు రాజకీయ తెర మీద వినిపిస్తున్నాయి. అనేక రకాలుగా ప్రచారం సాగుతోంది. ఇక ఈ ఒక్క సీటు ఎవరికి వెళ్తుంది అన్నది కూడా మరో చర్చగా ఉంది.అయితే ఢిల్లీ వర్గాల నుంచి అందుతున్న సమాచారం మేరకు చూస్తే కనుక ఈ సీటు కచ్చితంగా బీజేపీకే వెళ్తుంది అని అంటున్నారు. ఇదిలా ఉండగా ఈ సీటు బీజేపీలో ఎవరికి అన్నది మరో చర్చ. విజయసాయిరెడ్డి ప్లేస్ ని తమిళనాడు బీజేపీకి చెందిన మాజీ ప్రెసిడెంట్ అన్నామలై భర్తీ చేస్తారు అన్నది కూడా ఇప్పటిదాకా వస్తున్న ప్రచారంగా ఉంది.అయితే ఇపుడు మరో ప్రచారం ఏమిటి అంటే కేంద్రంలో గత అయిదేళ్ళలో మంత్రిగా పనిచేసి బీజేపీ మహిళా నాయకురాలిగా ఎంతో కీలకంగా ఉన్న స్మృతి ఇరానీకి ఈ సీటు ఇస్తారని. ఆమెని ఈ సీటు నుంచి పోటీ చేయించి రాజ్యసభకు తెస్తారని అంటున్నారు. ఇక ఆమెకి ఏపీ కోటాలో కేంద్ర మంత్రి పదవి కూడా ఇస్తారని అంటున్నారు.దాంతో ఇదేమి కొత్త ట్విస్ట్ అని అంతా ఆలోచిస్తున్నారు. ఢిల్లీకి చెందిన స్మృతి ఇరానీని ఏపీ నుంచి రాజ్యసభకు పంపించడం ద్వారా ఏ రకమైన రాజకీయ సందేశం ఇస్తారు అన్నది కూడా చర్చగా ఉంది. అయితే ఏపీలో బీజేపీని బలోపేతం చేసేందుకు స్మృతి ఇరానీ సేవలు ఉపయోగపడతాయన్న కోణంలో ఆమెను ఎంపిక చేయవచ్చు అని అంటున్నారు.మరో వైపు చూస్తే ఉత్తరప్రదేశ్ లో అమేధీ లోక్ సభ నియోజకవర్గం నుంచి 2024 ఎన్నికల్లో పోటీ చేసి స్మృతి ఇరానీ ఓటమి పాలు అయ్యారు. ఆమె ఆ సీటుకు సిట్టింగ్ ఎంపీగా ఉన్నారు 2019లో అదే సీటు నుంచి పోటీ పడిన రాహుల్ గాంధీని ఆమె ఓడించి జెయింట్ కిల్లర్ అయ్యారు.ఇక గత అయిదేళ్ళూ కేంద్రంలో ఆమె హవా ఒక లెక్కన సాగింది. అయితే ఆమె ఓటమి పాలు అయ్యాక వాయిస్ తగ్గింది. ఆమె పేరు ఢిల్లీ సీఎం రేసులో కూడా ఒక దశలో వినిపించింది. ఇపుడు చూస్తే ఆమెని ఏపీకి తెచ్చి పెద్దల సభలో కూర్చోబెడతారు అని అంటున్నారు.ఇదిలా ఉంటే ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో భేటీ అయి ఇరవై నిముషాల పాటు అనేక అంశాల మీద చర్చించారు. అందులో రాజ్యసభ అభ్యర్థి ఎవరు అన్న దాని మీద కూడా ఉందని అంటున్నారు. ఈ నెల 29తో రాజ్యసభకు నామినేషన్ దాఖలు చేసే గడువు ముగిసిపోతుంది. అయితే ఒకటి రెండు రోజులలోనే రాజ్యసభ అభ్యర్థి పేరు కూటమి ప్రకటిస్తుంది అని అంటున్నారు. ఇంకో వైపు చూస్తే చంద్రబాబు కేంద్ర మంత్రులతో భేటీలు వేస్తూ బిజీగా ఉన్న వేళ అమిత్ షాతో ఆయన బీజేపీ అభ్యర్థి గురించి చర్చిస్తున్న వేళ వైసీపీ మాజీ నేత విజయసాయిరెడ్డి కూడా కాకతాళీయంగా ఢిల్లీలోనే ఉన్నారని ప్రచారం సాగుతోంది.మరి ఆయన ఢిల్లీలో ఎందుకు ఉన్నారో ఏమో తెలియదు అంటున్నారు. ఒకవేళ వారూ వీరూ కాకుండా విజయసాయిరెడ్డే బీజేపీ తరపున తిరిగి ఎంపీ అభ్యర్థి అవుతారా అన్న ప్రచారం కూడా సాగుతోందిట. సో ఈ సస్పెన్స్ కి ఒకటి రెండు రోజులలో ముగింపు ఉండే చాన్స్ ఉంది అని అంటున్నారు.

# గ్రేటర్‌లో బీఆర్ఎస్.. గ్రేట్ ఎస్కేప్



హైదరాబాద్, కొన్ని కొన్ని సార్లు కాలం విసిరే సవాళ్లు ఎలా ఉంటాయంటే.. ఏదో చేసేద్దామని ఉన్నా.. ఏమీ చేయలేని పరిస్థితులుంటాయ్. హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల విషయంలోనూ.. బీఆర్ఎస్‌కు అలాంటి పరిస్థితే ఎదురైంది. పోటీ చేసేందుకు అవసరమైనంత బలం లేదు. ఉన్న అవకాశమల్లా ఓటింగ్‌లో పాల్గొనడమే. కానీ.. ఒక పార్టీతో సింక్ లేదు.. మరో పార్టీతో లింక్ లేదు. ఇంతటి కన్ఫ్యూజన్‌లోనూ.. బీఆర్ఎస్ ఫుల్ క్లారిటో ఓ డెసిషన్ తీసుకుంది. అదేంటో.. మీరే చూడండి.మొన్నటిదాకా హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎంఐఎం అభ్యర్థి ఏకగ్రీవం అయిపోతారనుకున్నారు. అక్కడ వాళ్లకున్న బలం అలాంటిది. కానీ.. ఎప్పుడైతే బీజేపీ తమ అభ్యర్థిని బరిలోకి దించిందో.. అప్పుడు ఎన్నిక అనివార్యమైంది. ఈ ఎన్నికల్లో.. ఎక్స్‌అఫీషియో సభ్యులతో కలిపి మొత్తంగా 112 మంది ఓటర్లు ఉన్నారు. పార్టీల వారీగా చూసుకుంటే.. ఎంఐఎంకి ఓ ఎంపీ, ఓ ఎమ్మెల్సీ, ఏడుగురు ఎమ్మెల్యేలు ఎక్స్ అఫీషియో సభ్యులు ఉన్నారు. వారితో పాటు 40 మంది కార్పొరేటర్లు ఉన్నారు.

**ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలవాలంటే 57 ఓట్లు కావాలి!**

దాంతో.. ఎంఐఎం బలం 49కి చేరింది. ఎన్నిక ఏకగ్రీవం కాకుండా బరిలో దిగిన బీజేపీకి.. నలుగురు ఎంపీలు, ఓ ఎమ్మెల్యే, ఓ ఎమ్మెల్సీ ఎక్స్‌అఫీషియో సభ్యులుగా ఉన్నారు. అలాగే.. బీజేపీలో గెలిచి పార్టీ మారిన కొందరు కార్పొరేటర్లని మినహాయిస్తే.. మరో 19 మంది కార్పొరేటర్లతో కలిపి 25 మంది ఓటర్లు ఉన్నారు. కానీ.. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలవాలంటే 57 ఓట్లు దక్కించుకోవాలి. కాబట్టి.. ఎంఐఎం అయినా, బీజేపీ అయినా.. ఇతర పార్టీల ఓటర్లపై ఆధారపడటం తప్ప మరో అవకాశం లేదు.

**కాంగ్రెస్ పార్టీకి ఏడుగురు ఎక్స్‌అఫీషియో సభ్యులు**

ఎంఐఎంకు మిత్రపక్షంగా కొనసాగుతున్న అధికార కాంగ్రెస్ పార్టీలో.. ఇతర పార్టీల నుంచి వచ్చి చేరిన వారితో కలిపి.. ఏడుగురు ఎక్స్‌అఫీషియో సభ్యులు, మరో ఏడుగురు కార్పొరేటర్లతో కలిపి.. మొత్తం 14 మంది ఓటర్లు ఉన్నారు. పోటీలో లేని బీఆర్ఎస్ దగ్గర పార్టీ ఫిరాయించిన వారు మినహా 9 మంది ఎక్స్‌అఫీషియో సభ్యులు, 15 మంది కార్పొరేటర్లతో కలిపి.. 24 మంది ఓటర్లు ఉన్నారు. అందువల్ల.. పార్టీలకు అతీతంగా అన్ని పార్టీల ఓటర్లను కలిసి వారి ఓట్లను దక్కించుకుంటామనే ధీమాలో ఉంది బీజేపీ. ఇక్కడే.. బీఆర్ఎస్ ఊహించని విధంగా షాక్ ఇచ్చింది. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌లో పాల్గొనొద్దని.. తమ కార్పొరేటర్లు, ఎక్స్‌అఫీషియో సభ్యులను ఆదేశిస్తూ విప్ జారీ చేస్తామని ప్రకటించింది.

**బీఆర్ఎస్ తీసుకున్న నిర్ణయంతో బీజేపీకి పెద్ద దెబ్బ**

బీఆర్ఎస్‌తో పాటు కాంగ్రెస్ పార్టీలోఉన్న కార్పొరేటర్లను ఏదో రకంగా తమవైపు తిప్పుకోవాలనుకున్న బీజేపీ లెక్కలకు.. బీఆర్ఎస్ తీసుకున్న నిర్ణయం పెద్ద దెబ్బేననే చర్చ జరుగుతోంది. మరోవైపు.. బీఆర్ఎస్ కూడా ఎంతో చాకచక్యంగా ఈ పోలింగ్ నుంచి తప్పుకుందనే విశ్లేషణలు వినిపిస్తున్నాయ్. ఎందుకంటే.. ఇప్పుడు ఎంఐఎంతో మిత్రుత్వం లేదు. బీజేపీతో తమకు అసలే పడదని.. బీఆర్ఎస్ నేతలు చెబుతుంటారు. ఇలాంటి పరిస్థితుల్లో.. బీఆర్ఎస్ నేతలు పోలింగ్‌లో పాల్గొంటే.. అటు ఎంఐఎం గెలిచినా, ఇటు బీజేపీ గెలిచినా.. బద్నాం అయ్యేది మాత్రం బీఆర్ఎస్సేననే టాక్ గట్టిగా వినిపిస్తోంది.

**మజ్లిస్ గెలిస్తే.. కారు స్టీరింగ్ ఎంఐఎం చేతిలోనే ఉందనే విమర్శలు**

మజ్లిస్ పార్టీ గెలిస్తే.. ఇంకా కారు స్టీరింగ్ ఎంఐఎం చేతిలోనే ఉందని బీజేపీ ఆరోపిస్తుంది. అదే.. బీజేపీ గెలిస్తే.. కారు, కమలం ఒకటేనని కాంగ్రెస్ వాయిం చేస్తుంది. అందువల్ల.. ఎటూ కాకుండా పోలింగ్‌కు దూరంగా ఉంటే.. రాజకీయంగా ఎలాంటి బాధ ఉండదనే ఆలోచనతోనే.. బీఆర్ఎస్ ఈ నిర్ణయం తీసుకుందనే చర్చ రాజకీయ వర్గాల్లో సాగుతోంది. ఏదేమైనా.. బీఆర్ఎస్ తీసుకున్న నిర్ణయం ఎంఐఎంని సునాయాసంగా గట్టెక్కేలా చేసిందంటున్నారు విశ్లేషకులు.

# దువ్వాడ సస్పెన్షన్.. వైసీపీ పేజ్ లో ఎన్నో కామెంట్స్!

విజయవాడ:ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ ను పార్టీ నుంచి సస్పెండ్ చేయడంపై తీవ్ర చర్చ జరుగుతోంది. పార్టీ క్రమశిక్షణ ఉల్లంఘనకు పాల్పడినట్లు ఫిర్యాదులు రావడంతో పార్టీ క్రమశిక్షణ కమిటీ సిఫార్సుల మేరకు పార్టీ అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డి ఈ నిర్ణయం తీసుకున్నట్లు వైసీపీ కేంద్రం కార్యాలయం ఓ ప్రకటన జారీ చేసింది. అయితే దువ్వాడ పార్టీ క్రమశిక్షణ అతిక్రమించారో లేదో కానీ, వ్యక్తిగత క్రమశిక్షణ తప్పడం, పార్టీ పరువును బజారున పడేయడం వల్లే సస్పెండ్ చేసినట్లు పార్టీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ఈ నిర్ణయాన్ని ఎప్పుడో తీసుకోవాలని, పార్టీకి పూర్తిస్థాయి డ్యామేజ్ జరిగిన తర్వాత ఇప్పుడు సస్పెండ్ చేయడం వల్ల ప్రయోజనమేంటన్న ప్రశ్న కూడా తలెత్తుతోంది. ముఖ్యంగా పార్టీ నిర్ణయంపై సొంత కార్యకర్తలతోపాటు సోషల్ మీడియా యాక్టివిస్టులు విమర్శలు గుప్పిస్తున్నారు. రకరకాల కామెంట్స్ తో వైసీపీ పేజీలు నిండిపోతున్నాయి. దువ్వాడతోపాటు మరికొందరిని కూడా సాగనంపితే బాగుంటదనే సూచనలు వస్తున్నాయి.శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఎమ్మెల్సీ దువ్వాడ సస్పెన్షన్ వైసీపీలో తీవ్ర దుమారం రేపుతోంది. గత కొంతకాలంగా వ్యక్తిగత అంశాలతో ఆయన అన్ని హద్దులు అతిక్రమించి పార్టీ పరువును బజారు కీడ్చేశారనే విమర్శలు వినిపిస్తున్నాయి. కుటంబం, భార్యతో తగాదా మొదలైన నాడే పార్టీ స్పందిస్తే బాగుండేదని అంటున్నారు. మరీ ముఖ్యంగా నాలుగు గోడల మధ్య చర్చించాల్సిన అంశాలు, విషయాలను ఆయన పబ్లిక్ గా చాటుకోవడం.. మీడియాలో మరీ ముఖ్యంగా తన అనైతిక వ్యవహారాలను సోషల్ మీడియా వేదికగా సమర్థించుకోవడం, దానికి వంత పాడినట్లు ఇన్నాళ్లు పార్టీ స్పందించకపోవడంతో చాలా డ్యామేజ్ జరిగిందని అంటున్నారు. దీనిపై రకరకాల కామెంట్స్ తో పార్టీ నిర్ణయాన్ని తప్పుపడుతున్నారు. నిజానికి దువ్వాడను ఎప్పుడో సాగనంపాలని, నువ్వు ఎక్కాల్సిన ట్రైన్ జీవిత కాలం లేటు అన్నట్లు పార్టీ అన్ని విధాలుగా నష్టపోయిన తర్వాత సస్పెన్షన్ వేటు వేయడంపై ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.దువ్వాడతో పాటు పనిలో పనిగా మరికొందరిపై వేటు వేయాలని సోషల్ మీడియా పేజీల్లో కార్యకర్తలు డిమాండ్ కేస్తున్నారు. పార్టీ నుంచి సాగనంపాల్సిన వారిలో మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్, ఎమ్మెల్సీ అనంతబాబుతోపాటు మరికొందరి పేర్లు సూచిస్తున్నారు. డ్రైవర్ సుబ్రహ్మణ్యంను అరెస్టు చేసి డోర్ డెలవరీ చేసిన ఎమ్మెల్సీ అనంతబాబును సస్పెండ్ చేయాలని ఎక్కువ మంది పోస్టింగులు చేస్తున్నారు. అదేవిధంగా దువ్వాడను సస్పెండ్ చేస్తున్నట్లు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి వచ్చిన ప్రకటనపై అధ్యక్షుడు జగన్ సంతకం లేకపోవడాన్ని కొందరు ప్రస్తావిస్తున్నారు. గౌరవ డాక్టరేట్ పొందిన గౌరవప్రదమైన వ్యక్తిని పార్టీ నుంచి బహిష్కరిస్తారా? ఇది చాలా పెద్ద తప్పు అంటూ ఓ వీరాభిమాని సెటైర్ వేశారు.ఇక అంతిమంగా మంచి నిర్ణయం



తీసుకున్నారని కొందరు అభినందిస్తుండగా, ఎక్కువ మంది మాత్రం పార్టీ నిర్ణయం తీసుకోవడంలో చాలా జాప్యం జరిగిందనే అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మర్డర్ చేసి డోర్ డెలివరీ చేసినోడిని కూడా ఇలాగే సస్పెండ్ చేసాం అని చెప్పారు. నెక్స్ట్ మీ ప్రతీ మీటింగ్స్ లో ఉన్నాడు. చివరికి జగన్ పక్కనే ఒకే వేదిక మీద కూర్చున్నాడు. మీ పార్టీ సస్పెనస్ అంతే... అంటూ ఓ సోషల్ యాక్టవిస్టు పోస్టు చేశాడు. ఇప్పటికీ జ్ఞానోదయం ఐయ్యింది ఇలాంటి స్క్రాప్ పార్టీ లో చాలా మంది ఉన్నారు. అందరినీ వేరి పారేయాలి అంటూ మరో కార్యకర్త సూచించాడు. ఇలాంటి పనులు ఎలక్షన్ బిఫోర్ చేసి ఉంటే కనీసం ప్రతిపక్ష హోదా అయినా వచ్చి ఉండేది అంటూ మరో కార్యకర్త అభిప్రాయపడ్డాడు. మొత్తానికి దువ్వాడ బహిష్కరణ ఆలస్యమైందని, దువ్వాడతోపాటు పార్టీ అధినేత పక్కనే ఉంటూ వెన్నుపోటు పొడుస్తున్నవారినీ గమనించాలని ఎక్కువ మంది కార్యకర్తలు సూచిస్తున్నారు. చడీచప్పుడు చేయకుండా దువ్వాడ సస్పెన్షన్ పై నిర్ణయం తీసుకోవడంపై కూడా ఆశ్యర్యం వ్యక్తమవుతోంది. నిజానికి గత ఎన్నికల ముందే దువ్వాడ వ్యవహారం అధినేత దృష్టికి వచ్చిందని, అప్పట్లో ఆయన భార్య దువ్వాడ వాణి ఫిర్యాదుతో టెక్కలి ఇన్ చార్జిగా దువ్వాడను తప్పించి వాణిని నియమించారని అంతా గుర్తు చేస్తున్నారు. ఆ సమయంలోనే దువ్వాడను వారించి వ్యక్తిగత వ్యవహారశైలిపై పార్టీ నుంచి మందలించి ఉంటే వ్యవహారం ఇంతవరకు వచ్చేది కాదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. తమకు అన్యాయం చేస్తున్నాడని భార్య, బిడ్డలు లబోదిబోమంటున్న పార్టీ నుంచి మద్దతు లభించకపోవడం, ఇక ఎన్నికలు అయిన మరుక్షణం నుంచి కుటుంబ వివాదం రోడ్డెక్కడం, దువ్వాడ ఆయన సన్నిహితురాలు ప్రజలు గమనిస్తున్నారనే అంశాన్ని వదిలేసి తిరుగుతుండటంతో వైసీపీకి అన్ని విధాలుగా నష్టం జరిగిందని అంటున్నారు. మొత్తానికి దువ్వాడను వదిలించుకోవడం ద్వారా వైసీపీ ఇప్పుడిప్పుడే ప్రక్షాళన దిశగా అడుగులు వేస్తోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# యువ ఓటర్లు లక్ష్యంగా బిజెపి కార్యాచరణ




హైదరాబాద్, బండి సంజయ్‌ను అధ్యక్ష పదవి నుంచి మార్చాక బిజెపిలో కొంత ఊపు తగ్గింది. తెలంగాణలో అధికారంలోకి చచ్చే ఛాన్స్ ఉన్నా కోల్పోయిందన్న విమర్శలు ఉన్నాయి. ఇప్పుడు బిజెపి మళ్లీ పుంజుకునేలా యత్నాలు చేస్తోంది. ఈ దశలో కొత్త అధ్యక్షుడు ఎవరన్న చర్చ సాగుతోంది. సమర్థత కన్నా కులాల కుంపట్లు బిజెపిలో అగ్గి రాజేస్తున్నాయి. బిసిలకే అంటూ కొత్త నినాదం బయలు దేరింది. కిషన్ రెడ్డి కేంద్రమంత్రిగా, పార్టీ అధ్యక్షుడిగా ఇంకా కొనసాగుతున్నందన ఆయన అటు కేంద్రంలోనూ..ఇటు రాష్ట్రంలోనూ దృష్టి పెట్టాల్సి వస్తోంది. ఇదే క్రమంలో తెలంగాణలో పార్టీ పటిష్టతపైనా పెద్దలతో చర్చిస్తున్నట్లు సమాచారం. వచ్చే ఎన్నికల్లో ఓట్ల వేసేది ఎక్కువగా యువతేనని బీజేపీ భావిస్తోంది. సైలెంట్ ఓటింగ్ ఎక్కువగా ఉంటుందని అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం తెలుగు రాష్ట్రాలతోపాటు దేశ వ్యాప్తంగా ఓటర్లలో యువ ఓటర్ల సంఖ్యనే ఎక్కువ. తెలంగాణలో మొత్తం 3కోట్ల 03లక్షల మంది ఓటర్లు ఉన్నారు. ప్రతి ఓటరు ఎన్‌రోలింగ్ జాబితాలో దాదాపు 4లక్షల మంది 18-19 సంవత్సరాల వయసు ఉన్న కొత్త ఓటర్లు చేరుతున్నారు. మొత్తం ఓటర్లలో యువ ఓటర్ల సంఖ్య కోటికిపైనే ఉంటుందని, ప్రతీ ఎంపీ , అసెంబ్లి సెగ్మెంట్‌లో వీరి ఓట్లు గెలుపోటములను నిర్ణయిస్తాయని బీజేపీ అంచనా వేస్తోంది.అందుకే యువత ఓట్లను పొందాలంటే జాతీయవాద అంశాలపై వరుస కార్యక్రమాలను నిర్వహించాలని బీజేపీ అధిష్టానం రోడ్ మ్యాప్ ఇచ్చినట్లుగా తెలస్తోంది. ఈ క్రమంలో తెలంగాణ అసెంబ్లీలో చాపకింద నీరులా విస్తరించి అధికారాన్ని చేజిక్కించుకోవాలని బీజేపీ ప్రణాళికలు సిద్ధం చేసుకుంది. జాతీయవాద అంశాలతో ప్రజల్లోకి వెళ్లాలని నిర్ణయించింది. జాతీయవాద అంశాలను ప్రజల్లో మరీముఖ్యంగా యువతరాన్ని ఆకట్టుకునేవిధంగా ప్రస్తావిస్తూనే స్థానిక సమస్యలను కూడా లేవనెత్తాలని భావిస్తోంది. ఎంపి ఎన్నికల్లో మంచి ఫలితాలు రావడంతో ఇప్పటి నుంచే వచ్చే అసెంబ్లీ ఎన్నికలకు సన్నద్ధం కావాలని పార్టీ యోచిస్తోంది. జాతీయవాద అంశాలపై విస్తృత కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించడం వెనక యువత ఓట్లను కొల్లగొట్టడమే కాషాయ పార్టీ ప్రధాన లక్ష్యంగా తెలుస్తోంది. దీర్ఘకాలిక వ్యూహం లక్ష్యంగా చేసుకుని వరుసగా జాతీయవాదాన్ని తట్టిలేపే కార్యక్రమాలకు రూపకల్పన చేసింది. అధిష్టానం ఆదేశాలతో ఈ కార్యక్రమాన్ని పార్టీ తెలంగాణ రాష్ట్ర నాయకత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ప్రతి జిల్లాకు , ప్రతి అసెంబ్లి నియోజకవర్గానికి ప్రత్యేకంగా కో.ఆర్డినేటర్లను నియమించి పనిచేస్తోంది. ఇప్పటికే ఆరెస్సెస్ ఎన్నికలు జరిగే రాష్ట్రాల్లో ఎలా సైలెంట్ గా ప్రచారం చేస్తుందో అలా తెలంగాణలోనూ కార్యచరణ ప్రారంభించింది. పోలింగ్ బూత్‌స్థాయిలో, మండల స్థాయిలో, జిల్లా స్థాయిలో , రాష్ట్ర స్థాయిలో ప్రచార కార్యక్రమాలను ప్లాన్ చేసుకుంటున్నారు. దేశ విభజన సమయంలో చోటు చేసుకున్న మారణకాండపై ప్రచారం, దేశ విభజన గాయాలకు చెందిన ఫోటోలు, ఫీల్మ్‌లను, నాటి వార్తా పత్రికల ప్రతులను ప్రదర్శన చేయడం కూడా వీరి లక్ష్యంగా ఉంది. ముఖ్యంగా సోషల్ మీడియా మేనేజ్‌మెంట్ బాగా ఉపయోగి స్తున్నారు. సార్వత్రిక ఎన్నికలనాటికి ప్రతి పల్లెలో జాతీయవాదాన్ని తట్టిలేపుతూ యువతను సంఘటితం చేసేలా బీజేపీ ఎ÷-లాన్ చేసిందని అంటున్నారు. ఇది వర్కవుట్ అయితే సైలెంట్ ఓట్ల సునామీ ఉంటుందని బీజేపీ వర్గాలు నమ్మకంతో ఉన్నాయి. జమిలి ఎన్నికల గురించి పలవరిస్తున్న బిజెపి దీనిని త్వరగా ముందుకు తీసుకుని వెళ్లేందుకు ప్రయత్నం మొదలు పెట్టింది.

# రాజమండ్రి రూరల్‌పై బీజేపీ వర్సెస్ జనసేన..!



రాజమండ్రి:ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని రాజమండ్రి రూరల్ నియోజకవర్గం గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. గోరంట్ల బుచ్చయ్య చౌదరి ఇక్కడ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. 2024లో జరిగిన ఎన్నికల్లో కూటమి పార్టీలు గెలిచినప్పుడు.. తొలి ఎన్నికల ఫలితంఇక్కడ నుంచే వచ్చి.. పార్టీలకు బూస్ట్ ఇచ్చినట్టు అయింది. అయితే.. ఈ నియోజకవర్గం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. వచ్చే ఎన్నికల నాటికి గోరంట్ల బుచ్చయ్యచౌదరి రిటైర్ అవుతారన్న ప్రచారం ఉంది.వాస్తవానికి గత ఏడాది ఎన్నికల సమయంలోనే రూరల్ నియోజకవర్గాన్ని జనసేన కోరుకుంది. దీంతో ప్రస్తుత మంత్రి కందుల దుర్గేష్ కూడా.. కొన్ని రోజులు అక్కడ ప్రచారం చేసుకున్నారు. అయితే.. ఇదే తనకుచిట్టచివరి అవకాశమని గోరంట్ల మొర పెట్టుకోవడంతో చివరి నిముషంలో మార్పులు చేశారు. దీంతో నిడదవోలు నియోజకవర్గం నుంచి దుర్గేష్ పోటీ చేసి విజయం దక్కించుకున్నారు.అయితే.. వచ్చే ఎన్నికలకైనా.. గోరంట్ల తన సీటును ఖాళీ చేయడం తప్పదన్న వ్యూహంతో దుర్గేష్.. రూర ల్ నియోజకవర్గంపై ఎక్కువగా దృష్టి పెట్టారు. తరచుగా ఆయన అనధికారికంగా ఇక్కడ సమావేశాలు నిర్వహించడంతోపాటు.. తన వారిని కూడా ఇక్కడ పెట్టి.. నియోజకవర్గంలో ఏం జరుగుతున్న తెలుసు కుంటున్నారట. అంతేకాదు.. నియోజకవర్గంలో ప్రజలు తమ సమస్యలు వినిపించేందుకు దుర్గేష్ కార్యాలయానికి ఫోన్లు చేసే అవకాశం కల్పించి.. వచ్చే ఎన్నికల నాటికి రంగం రెడీ చేసుకుంటున్నారు.అయితే.. ఈ క్రమంలోనే బీజేపీ కూడా ఎంట్రీ ఇచ్చింది. తాము మాత్రం తక్కువ తిన్నామా? అంటూ.. బీజేపీ నాయకులు.. రూరల్‌పై పట్టు పెంచుకునే ప్రయత్నం చేస్తున్నారు. గ త ఎన్నికల్లో రాజమండ్రి పార్లమెంటు స్థానం నుంచి విజయం దక్కించుకున్న పురందేశ్వరికి.. బీజేపీ కీలక నాయకుడు ఒకరు సాయం చేశారు. అందరినీ సమన్వయం చేసి.. ఆమె విజయానికి కారణంగా మారారు. దీంతో ఆయన కు గిఫ్టుగా వచ్చే ఎన్నికల్లో రూరల్ టికెట్ ఇప్పించేందుకు పురందేశ్వరి ఇప్పటికే ప్లాన్ చేశారని మరో చర్చ సాగుతోంది.దీంతో బీజేపీ నేతలు కూడా.. రూరల్‌పై పట్టు పెంచుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. పురందేశ్వరి కార్యక్రమాలు కూడా.. తరచుగా అక్కడ జరుగుతుండడాన్ని బట్టి.. బీజేపీ వ్యూహం నిజమేనని స్థానికులు చెబుతున్నారు. మరి ఈ సీటుపై ఎవరు పట్టు పెంచుకుంటారో చూడాలి.

## విశాఖలో భూకేటాయింపుల కుంభకోణం

విశాఖపట్టణం, విశాఖలో భూ కేటాయింపులతీరుపై అనుమానాలు ఉన్నాయని, వాటి వివరాలను బయటపెట్టాలని మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ డిమాండ్ చేశారు. ఈ కేటాయింపులు లోపభూయిష్టంగానే కాకుండా దోచిపెట్టేలా ఉన్నాయని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. షెల్ కంపెనీల సృష్టికర్త చంద్రబాబు అని ఆరోపించారు. షెల్ కంపెనీలకు ప్రభుత్వ భూములను కట్టబెడుతున్నారు.. ఉర్సా కంపెనీకి కార్యాలయం లేదు ఒక ఉద్యోగి లేదు..

# కేసులపై బాబు విచారణ చేయించుకోవాలి



అమరావతి, పారదర్శకత,నీతి గురించి మాట్లాడుతున్న చంద్రబాబు తన కేసులపై విచారణ ముందు చేయించుకోవాలని, కుంటి సాకులతో కేసుల నుంచి బయటకు వచ్చారంటూ వైసీపీ నేత ఆర్కే రోజా విమర్శించారు. నాలుగో సారి సీఎంగా రాష్ట్రంలో ఇప్పటి వరకు చంద్రబాబు ఇల్లు కట్టుకోలేదు అని మాజీమంత్రి ఆర్కే రోజా అన్నారు. ఇప్పుడు ఏదో మొదలు పెట్టారు.. మాట్లాడితే జగన్ బెంగుళూరు వెళ్తున్నారు అంటున్నారు.. గతంలో మీరు ఎక్కడి నుంచి వచ్చారని ప్రశ్నించింది. శుక్రవారం అయితే హైదరాబాద్ కి వెళ్లి పోతున్నారు.. మీరు హైదరాబాద్ లో ఉండటం వల్లే వరదలకు విజయవాడ మునిగి పోయింది.. అధికారంలో ఉన్న మీరు హైదరాబాద్ లో తిరుగుతున్నారని జనాలు నవ్వుకుంటున్నారు.. ఇక, అమరావతిని దోచుకోవాలని అనుకున్న చంద్రబాబుపై ప్రధాని మోడీ విచారణ చేయించాలని ఆర్కే రోజా డిమాండ్ చేసారు. ప్రధాని తక్షణమే సీబీఐ విచారణకు ఆదేశించాలన్నారు. అయితే, వైజాగ్ ను రాజధాని చేయాలని జగన్ కలలు కన్నారు.. పరిపాలన రాజధాని చేస్తే వైసీపీ వల్ల అరాచకాలు చేస్తారని భయ పెట్టారు.. వైజాగ్ లో 60 రోజుల ముందు పుట్టిన ఉర్సా కంపెనీకి మూడు వేల కోట్ల భూములు దారాదత్తం చేశారు.. దావోస్ లో వీళ్లకు ఒక్క ఎంఓయూ కూడా కాలేదు.. హైదరాబాద్ లో వీళ్ళు ఇచ్చిన కంపెనీకి బోర్డులు, అడ్రస్ లు కూడా లేవు.. టీడీపీకి చెందిన ఓ ఎంపీ స్నేహితుడి కంపెనీకి ఎకరాలకు ఎకరాల భూములు కట్టబెడుతున్నారంటూ ఆరోపణలు చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా రైతుల ఇబ్బందులపై వైసీపీ అండగా నిలబడుతుంది అని మాజీ మంత్రి రోజా తెలిపింది. అలాగే, హిందువులు పూజించే గోమాతలు మృతి చెందుతున్నప్పటికీ చంద్రబాబు ఒప్పుకోవటం లేదు అని వైసీపీ నేత రోజా అన్నారు. ఇప్పటికే రెచ్చగొట్టేలా మాట్లాడుతున్నారు.. ఈ ఏడాదిలో తిరుమలలో ఎన్ని అనర్థాలు జరుగుతున్నాయో ప్రజలు గమనించాలి.. చెప్పులు వేసుకుని గుళ్ళకు వస్తున్నారు.. తిరుమలలో ఏం జరుగుతుందో కూడా చూడాలని సూచించింది. శ్రీకూర్మంలో అన్నీ తాబేళ్లు చనిపోతున్నా పట్టించుకోవటం లేదు.. ప్రజలకు మంచి చేయటానికి వీళ్లకు -టైం లేదు.. ఇక, సనాతన ధర్మాన్ని కాపాడుతానన్న పవన్ ఎందుకు నోరు మెదపటం లేదని ప్రశ్నించింది. బీజేపీ వాళ్ళు ఇన్ని అపచారాలు జరుగుతుంటే ఎందుకు సరిదిద్దటం లేదు.. కూటమిలో ఉంటే ప్రభుత్వం చేస్తున్న తప్పులను కూడా సమర్థిస్తారా అని ఆర్కే రోజా అడిగింది. కాగా, మద్యం ప్రభుత్వం అమ్మితే స్కామా.. ప్రైవేట్ వాళ్ళు అమ్మితే స్కామా అని మాజీ మంత్రి రోజా ప్రశ్నించింది.ఎంపీ మిథున్ రెడ్డి పార్లమెంట్ లో వీళ్ళ కుట్రలపై మాట్లాడు తున్నారు కాబట్టే కేసులు పెట్టారని పేర్కొనింది. ఆయనపై ఏ ప్రాతిపదికన విచారణ చేస్తున్నారో అర్థం కావటం లేదు.. జగన్ స్కీములు మాత్రమే చేశారు.. జగన్ బటన్లు నొక్కితే అవినీతి జరిగే అవకాశం లేదని చెప్పుకొచ్చింది. అయితే, చంద్రబాబు ప్రస్తుతం దోచుకునే పనులు చేస్తున్నారు.. రాష్ట్రంలో విచ్చలవిడిగా బెల్ట్ షాపులు పెట్టారు.. వీటి వల్ల మద్యం మత్తులో దాడులు కూడా పెరిగాయి.. ఆడవాళ్ళు బయటకు తిరగలేని పరిస్థితి ఏర్పడి ఒదన్నారు. ఇవాళ వైసీపీ నేతలపై అక్రమ కేసులు పెట్టి నీతిమాలిన రాజకీయాలు చేస్తున్నారు చంద్రబాబు.. పవన్, చంద్రబాబుకు ఎప్పుడు అవసరం వస్తే అప్పుడే బయటకు వస్తారు..

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com